

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 01-09-2025 | సంపుటి - 24 | సంచిక - 113 రూ : 4 | పేజీలు: 8



## ప్రధానిని విందుకు ఆహ్వానించిన జిన్ పింగ్ దంపతులు

- టియాంజిన్‌లో జరుగుతున్న ఎస్సీవో సదస్సులో దేశాధినేతలకు విందు
- విందుకు ముందు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ కీలక భేటీ
- సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతతలే లక్ష్యమని ఇరు నేతల స్పష్టీకరణ
- పలువురు ప్రపంచ నేతలతోనూ ప్రధాని మోదీ వరుస సమావేశాలు

2లో

## సీబీఐ కాళేశ్వరం



- ప్రాజెక్టుపై విచారణ కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగిస్తూ శాసనసభ నిర్ణయం
- రీడిజైన్ పేరుతో కేసీఆర్ రూ.లక్ష కోట్లు కొల్లగొట్టారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 8బీ, 8సీ నోటీసులపై కేసీఆర్, హరీశ్‌రావులది వితండవాదమని ధ్వజం
- అర్ధరాత్రి దాటాకా సాగిన సభ
- సీఎం ప్రకటన అనంతరం నిరవధిక వాయిదా

2లో

## అసెంబ్లీ ముందుకు కాళేశ్వరం నివేదిక..

బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం





2లో

## భద్రాచలం వద్ద ఉగ్రరూపం దాల్చిన గోదావరి..

### రెండో ప్రమాద హెచ్చరిక జారీ

- మ8 అడుగులు దాటిన నీటిమట్టం
- రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన అధికారులు
- కల్యాణ కట్ట వరకు చేరిన వరద నీరు
- నాలుగు మండలాలకు నిలిచిపోయిన రాకపోకలు
- జలదిగ్బంధంలో వీఆర్ పురం, కూనవరం, చింతూరు

## బీసీ బిల్లులకు జై...

- 42% రిజర్వేషన్ బిల్లులకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదం
- మరో మూడింటికి సైతం..



2లో



2లో

## నారా లోకేశ్‌కు అరుదైన గౌరవం

## ప్రధాన దేవాలయాలకు కొత్త హంగులు



# మూడు కాలాల ముచ్చట..?

పెళ్ళి...
ఓ మూడు ముళ్ళ ముచ్చట...
వృద్ధాప్యం...
ఓ మూడు కాళ్ళ నడక...
జీవితం...
ఓ మూడు కాలాల ముచ్చట...

గతాన్ని...గురించి
ఎక్కువగా చింతించకు
దాని నిండా
చేదు జ్ఞాపకాల
రాళ్ళు రప్పలే...
ముళ్ళ తుప్పలే...
అది ఒక కన్నీటి వరదే...

భవిష్యత్తును...గురించి
ఎక్కువగా ఆలోచించకు...
అతిగా ఆశించకు
అతిగా కలలు కనకు
భయపడకు బాధపడకు
రేపన్నదానికి రూపన్నదిలేదు
అదొక భయభ్రాంతులు బురదే...

వర్తమానం...ఒక సరదే...
భగవంతుని వరమే...
అందుకే చింతలు
చీకాకులు లేకుండా
చిరునవ్వులతో

వర్తమానంలో నీవు జీవిస్తే...
ప్రశాంతత నీలో ప్రవహించు...
శుభాలు సుఖశాంతులు
ఘనవిజయాలు నిన్ను వరించు

ఆపై నీ ముందు జీవితం
ఒక విందు భోజనమే...
ఒక సంతోషాల సాగరమే...
ఒక అంబరాన్నంటే సంబరమే...
సందేహంలేదు నేస్తమా నా ప్రాణమిత్రమా!



**రచన:**
**కవిరత్న, సాహిత్యధీర, సహస్రకవి భూషణ్**
**పోలయ్య**
**కూకట్లపల్లి, అత్తాపూర్ హైదరాబాద్**

# ప్రధానిని విందుకు ఆహ్వానించిన జిన్ పింగ్ దంపతులు

చైనా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఆ దేశ అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఆయన అర్ధాంగి పెంగ్ లియువాన్ సాదర స్వాగతం పలికారు. టియాంజిన్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) శిఖరాగ్ర సదస్సుకు హాజరైన దేశాధినేతల గౌరవార్థం ఏర్పాటు చేసిన అధికారిక విందుకు మోదీని వారు ఆదివారం ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మోదీ.. జిన్‌పింగ్ దంపతులతో కరచాలనం చేసి, వారితో కలిసి ఫొటోలకు ఫోజులిచ్చారు. అనంతరం ఇతర ప్రపంచ నేతలతో కలిసి గ్రూప్ ఫొటో సెషన్ లో పాల్గొన్నారు. ఈ విందుకు ముందు, ప్రధాని మోదీ, అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య కీలక ద్వైపాక్షిక సమావేశం జరిగింది. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతతలను కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని ఇరువురు నేతలు ఈ భేటీలో ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. పరస్పర గౌరవం, ఉమ్మడి ప్రయోజనాలు, సున్నితత్వాల ప్రాతిపదికన సహకారాన్ని కొనసాగించాలని పునరుద్ఘాటించారు. ఈ సమావేశం ఎంతో ఫలప్రదంగా జరిగిందని, భారత్ చైనా సంబంధాల్లో సానుకూల పురోగతిని సమీక్షించామని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. రెండు రోజుల ఎస్సీవో సదస్సులో పాల్గొనేందుకు జపాన్ పర్యటన ముగించుకుని ప్రధాని మోదీ శనివారం చైనాలోని టియాంజిన్‌కు చేరుకున్నారు. తన పర్యటనలో భాగంగా, ఆయన చైనా పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు కాయ్ చీతో భేటీ అయి ఆర్థిక, రాజకీయ, ప్రజా సంబంధాలపై చర్చించారు. అలాగే, సదస్సు వేదికగా మయన్మార్, నేపాల్, మాల్దీవుల అధినేతలతోనూ ఆయన విడివిడిగా సమావేశమయ్యారు. షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) 2001లో ఏర్పాటైన ఒక శాశ్వత అంతర్జాతీయ సంస్థ. ప్రస్తుతం ఇందులో చైనా, రష్యా, భారత్‌తో పాటు మొత్తం 10 సభ్య దేశాలు ఉన్నాయి.

# సీబీఐకి కాళేశ్వరం...

హైదరాబాద్: కాళేశ్వరం బ్యారేజీల్లో అక్రమాలు, వైఫల్యాలపై మరింత లోతుగా దర్యాప్తు చేయడానికి సీబీఐకి కేసు అప్పగించాలని శాసనసభ నిర్ణయించింది. ఆదివారం శాసనసభలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై జరిగిన చర్చకు సమాధానమిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అంతర్రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఆర్ఈసీ, పీఎఫ్‌సీ భాగస్వామ్యమై ఉన్నాయని.. అందుకే కేసును సీబీఐకి అప్పగించడం సముచితమని శాసనసభ భావిస్తోందని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఊరు, పేరు, అంచనాలు మార్చి దోచుకున్నవారిని శిక్షించాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రాజెక్టులో అక్రమాలపై ఇప్పటివరకు నివేదికలు ఇచ్చిన ఎన్‌డీఎస్‌ఏ, విజిలెన్స్, కాగ్, జస్టిస్ ఘోష్ కమిషన్... గత ప్రభుత్వాన్ని, నాటి ప్రభుత్వ పెద్దల్ని తప్పుపట్టాయన్నారు. తమ పరిధిలో ఉన్న ఏ సంస్థ దర్యాప్తు చేసినా తమ చిత్తశుద్ధిని శంకిస్తారని, అందుకే శషభిషలకు తావు లేకుండా కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. ఆదివారం అర్ధరాత్రి దాటాకా సాగిన సభ సీఎం ప్రకటన అనంతరం నిరవధికంగా వాయిదా పడింది.

**రాష్ట్రానికి గుదిబండగా మార్చారు**

అంతకుముందు సభలో సీఎం మాట్లాడుతూ ''ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ చేసిన మోసం అంతాఇంతా కాదు. రూ.లక్ష కోట్లు కొల్లగొట్టారు. ఏఐబీపీ కింద ఏదైనా ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం గుర్తిస్తే 75 శాతం నిధులిచ్చే నిబంధన ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో 25 ప్రాజెక్టులను ఈ పథకం కింద కేంద్రం గుర్తించింది. ఆ జాబితాలో ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు ఉంది. ఆ ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో మేడిగడ్డకు మార్చి రాష్ట్రానికి గుదిబండగా మార్చిన కేసీఆర్, హరీశ్‌రావును శిక్షించాల్సిన అవసరం ఈ సమాజానికి లేదా? అంబేడ్కర్‌పై కోపంతో కేసీఆర్ ఆ ప్రాజెక్టు పేరును మార్చి మేడిగడ్డ పేరుతో రూ.లక్ష కోట్లు దోచుకున్నారు. కేసీఆర్, హరీశ్‌రావులు చేసిన అరాచకాలను ఈటల రాజేందర్ ఆపలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ఆకృతి, నిర్మాణం, నిర్వహణ సరిగా లేవు. ప్రాజెక్టు వైఫల్యం ఏమాత్రం క్షమించరాని నేరమని ఎన్‌డీఎస్‌ఏ తేల్చిచెప్పింది. దీనికి అప్పటి ప్రభుత్వమే కారణమని చెబితే.. ఎన్‌డీఎస్‌ఏ నివేదికను ఎన్‌డీయే రిపోర్టని అంటున్నారు. మేడిగడ్డ కూలిపోవడంతో గోదావరిలో రూ.లక్ష కోట్లు కొట్టుకుపోయాయి. దీనిపై విచారణ చేయించి లోపాలు ఎత్తిచూపిస్తే అడ్డుకుంటున్నారు. కమిషన్ నివేదికలో ఏమైనా లోపాలుంటే వాటిని ప్రస్తావించకుండా జస్టిస్ ఘోష్‌ను తక్కువచేసి మాట్లాడటం సరికాదు.

**కాంట్రాక్టర్ల కమీషన్లకు కక్కుర్తి పడి...**

తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే నిర్మాణ వ్యయం, లిఫ్టులు, నిర్వహణ భారం తగ్గేవి. కానీ కాంట్రాక్టర్ల కమీషన్లకు కక్కుర్తి పడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో 2009లో ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు ప్రారంభించి రూ.6,157 కోట్లు ఖర్చుచేశారు. తెలంగాణ ఏర్పాటయ్యాక తొలి ఏడాది రూ.5,523 కోట్లు ఖర్చుచేశారు. ఈ ప్రాజెక్టు కింద రూ.11,670 కోట్లు ఖర్చు చేసిన తరువాత రీడిజైన్ పేరిట బ్యారేజీ స్థలాన్ని మార్చారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించుకునేందుకు మహారాష్ట్ర అంగీకరించింది. అక్కడ ప్రాజెక్టు నిర్మించుకోవచ్చని వాప్కోస్ చెప్పింది. అక్కడ 205 టీఎంసీల లభ్యత ఉందని అప్పటి కేంద్ర జలవనరులశాఖ మంత్రి ఉమాభారతి ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇవేమీ కాదని... మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టి మూడు లిఫ్టుల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు వీలుగా నివేదిక ఇవ్వాలని ఆ సంస్థను అడిగారు. 2015లో రీడిజైన్ పేరిట కేసీఆర్ మదిలో పడిన బీజం విషవృక్షమై తెలంగాణ ప్రాంతాన్ని, ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసింది. ప్రాణహిత కాదని చేపట్టిన కాళేశ్వరంతో మూడు బ్యారేజీల నిర్మాణంతో విద్యుత్తు వినియోగం 3వేల మెగావాట్ల నుంచి 8,450 మెగావాట్లకు పెరిగింది రూ.38 వేల కోట్ల ప్రాజెక్టు వ్యయం.. కాళేశ్వరం రీడిజైన్ కారణంగా రూ.1.47లక్షల కోట్లకు చేరింది.

* **దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చాం..**

కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్లను లూటీ చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని 4 కోట్ల మంది ప్రజలకు మేం హామీ ఇచ్చాం. అందుకు అనుగుణంగానే దోషులుగా తేలినవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మేం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మూడు నెలల్లోనే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించాం. ఎన్‌డీఎస్‌ఏ తాత్కాలిక, తుది నివేదికలు.. విజిలెన్స్ ప్రాథమిక, తుది నివేదికలతోపాటు కాగ్ నివేదికలను జస్టిస్ ఘోష్ కమిషన్‌కు ప్రభుత్వం సమర్పించింది. వాటి ఆధారంగానే కమిషన్ విచారణ జరిపింది. అయితే జస్టిస్ ఘోష్ కమిషన్ తమకు 8బీ, 8సీ నోటీసులు ఇవ్వలేదని.. అందుకే కమిషన్ నివేదిక చెల్లదని కేసీఆర్, హరీశ్‌రావు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విద్యుత్తు కొనుగోళ్లలో అక్రమాలపై జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ ఇవే నోటీసులిస్తే.. అలా ఇవ్వడం చెల్లదంటూ కేసీఆర్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పుడు జస్టిస్ ఘోష్ కమిషన్ అవే నోటీసులివ్వలేదని వితండవాదం చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇలాంటి ఇబ్బందులున్నందునే జాగ్రత్తగా ముందుకెళ్తున్నాం.

# అసెంబ్లీ ముందుకు కాళేశ్వరం నివేదిక.. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం

* **స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు**
* **ఈ మేరకు పురపాలక చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టిన ప్రభుత్వం**
* **అసెంబ్లీలో కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక**
* **పెన్‌డ్రైవ్‌ల రూపంలో ఎమ్మెల్యేలకు నివేదిక కాపీల అందజేత**
* **మరో రెండు కీలక బిల్లులను కూడా సభలో ప్రవేశపెట్టిన సర్కార్**

**హైదరాబాద్, ఆగస్టు 31:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇందుకు వీలు కల్పించేలా తెలంగాణ పురపాలక చట్టం2019కు సవరణలు చేస్తూ రూపొందించిన బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టింది. రెండో రోజు కొనసాగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా, పురపాలక చట్ట సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యంతోనే ఈ బిల్లును సభ ముందుకు తీసుకొచ్చినట్లు మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్నందున ఆర్డినెన్స్ జారీ చేసే అవకాశం లేదని, అందుకే చట్ట సవరణ ద్వారానే ఈ ప్రక్రియను పూర్తి చేస్తున్నట్టు చెప్పారు. ఈ బిల్లు ఆమోదంతో రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కోటా అమలు కానుంది. ఇదే సమావేశాల్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైన కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం సభ ముందు ఉంచింది. ఈ నివేదిక కాపీలను ఎమ్మెల్యేలందరికీ పెన్‌డ్రైవ్‌ల రూపంలో అందజేశారు. వీటితో పాటు ప్రభుత్వం మరో రెండు ముఖ్యమైన బిల్లులను కూడా సభలో ప్రవేశపెట్టింది. పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుతో పాటు, అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) సవరణ బిల్లును కూడా సభ పరిశీలనకు పెట్టింది.



# భద్రాచలం వద్ద ఉగ్రరూపం దాల్చిన గోదావరి.. రెండో ప్రమాద హెచ్చరిక జారీ

**భద్రాచలం ఆగస్టు 31:** భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. ఈ ఉదయం 9 గంటల సమయానికి నీటిమట్టం 48 అడుగులు దాటడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. దీంతో ఏజెన్సీ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరద ప్రభావంతో స్నాన ఘట్టాల ప్రాంతంలోని మెట్లు, విద్యుత్ స్తంభాలు నీట మునిగాయి. పవిత్ర స్నానాలు ఆచరించే కల్యాణ కట్ట వరకు వరద నీరు చేరడంతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. ఈ నేపథ్యంలో భక్తులు ఎవరూ నదిలోకి స్నానాలకు వెళ్లవద్దని అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. గోదావరి ఉధృతి కారణంగా తూరుబాక వద్ద ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరింది. దీంతో దుమ్ముగూడెం, చర్ల, వాజేడు, వెంకటాపురం వంటి నాలుగు మండలాలకు పూర్తిగా రాకపోకలు స్తంభించిపోయాయి. మరోవైపు, గోదావరి వరద పలు ఏజెన్సీ మండలాలను ముంచెత్తింది. వీఆర్ పురం, కూనవరం, చింతూరు మండలాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయి జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

# ప్రధాన దేవాలయాలకు కొత్త హంగులు

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వం బృహత్ ప్రణాళిక (మాస్టర్‌ప్లాన్)లను రూపొందిస్తోంది. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని వీటి రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. బాసర, భద్రాచలం, జోగులాంబ సహా 8 ప్రధాన దేవాలయాల అభివృద్ధికి రూ.2,202.35 కోట్ల వ్యయం అవుతుందని దేవాదాయశాఖ అంచనా వేసింది. లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం (ధర్మపురి), సమ్మక్క సారలమ్మ (మేడారం) ఆలయాలకు అంచనా వ్యయంపై స్పష్టత రావాల్సి ఉంది. రాష్ట్రంలోని ఆలయాలకు వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాలకు సంబంధించిన మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చాక ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. దీంతో ప్రస్తుతమున్న సౌకర్యాలు సరిపోవడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు దేవాదాయశాఖ డైరెక్టర్ వెంకట్‌రావు ఆలయాల అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్లు రూపొందిస్తున్నారు. రహదారుల విస్తరణ, ఉద్యానవనాలు, ట్రాఫిక్ నిర్వహణ, అన్నదాన కేంద్రాలు, అగ్నిమాపక సేవలు, క్యూలైన్ కాంప్లెక్స్, బ్రహ్మోత్సవాలలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వసతులు వంటి సౌకర్యాల్ని కల్పిస్తారు.

**సీఎం ఆమోదానికి బాసర మాస్టర్‌ప్లాన్**

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.696.25 కోట్లతో రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదం తెలిపింది. మొత్తం నాలుగు దశల్లో ఈ దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తారు. బాసరలోని జ్ఞాన సరస్వతి దేవస్థానాన్ని నాలుగు దశల్లో రూ.189.10 కోట్లతో అభివృద్ధి చేసేలా ప్రణాళిక రూపొందించారు. దాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం కోసం పంపించారు. సీఎం ఆమోదం తర్వాత కార్యాచరణ మొదలవుతుంది. భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానాన్ని మూడు విడతల్లో రూ.350 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయ్యింది. కలెక్టర్ నుంచి ప్రతిపాదనలు రావాల్సి ఉంది. మిగతా దేవాలయాలకు మాస్టర్‌ప్లాన్లు సిద్ధం అవుతున్నాయి.

# మంత్రి నారా లోకేశ్ కు మరో అరుదైన గౌరవం

* **ఆస్ట్రేలియా ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆహ్వానం**
* **స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావాలని పిలుపు**
* **ఆహ్వాన లేఖను పంపిన ఆస్ట్రేలియన్ హైకమిషన్**

ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కు మరో అరుదైన



గౌరవం దక్కింది. విద్యారంగంలో సంస్కరణల ద్వారా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కు మంత్రి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆస్ట్రేలియా ప్రభుత్వం నుంచి మంత్రికి ప్రత్యేక ఆహ్వానం అందింది. ప్రతిష్టాత్మక స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో పాల్గొనాలని మంత్రి లోకేశ్కు ఢిల్లీలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఆహ్వాన లేఖను పంపారు. మానవ వనరులు, సాంకేతిక, ఆర్థికాభివృద్ధి రంగాల్లో ఏపీ నాయకత్వాన్ని ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రశంసించింది. ఈ మేరకు స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేశ్ ను కోరింది. గత 20 ఏళ్లలో భారత్ కు చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు ఈ కార్యక్రమం ద్వారా ఆస్ట్రేలియాలో పర్యటించారని పేర్కొంది. 2001లో ప్రస్తుత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా ఇందులో పాల్గొన్నారని వెల్లడించింది. స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ లో భాగస్వామ్యం కావడం ద్వారా ఆస్ట్రేలియాలోని కీలక రాజకీయ నేతలు, విద్యారంగ నిపుణులు, వ్యాపారవేత్తలు, ప్రవాస భారతీయులతో సమావేశమయ్యే అవకాశం ఏర్పడుతుంది. తద్వారా ఏపీ అభివృద్ధి ప్రాధాన్యతలు.. ముఖ్యంగా విద్యారంగం, నైపుణ్యాలు, పెట్టుబడులు, ఆక్వాకల్చర్, మౌలిక వసతులపై ఆస్ట్రేలియాతో చర్చించేందుకు ఈ పర్యటన దోహదం చేస్తుంది.

# బీసీ బిల్లులకు జై...



హైదరాబాద్: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 50% రిజర్వేషన్ల పరిమితి నిబంధనను ఎత్తివేస్తూ.. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు ఉద్దేశించిన పురపాలక చట్ట సవరణ, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులకు రాష్ట్ర శాసనసభ ఆదివారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. వీటితోపాటు మరో 3 బిల్లులనూ సభ ఆమోదించింది. పురపాలక చట్ట సవరణ బిల్లును శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ఆ శాఖ మంత్రి సీతక్క ప్రవేశపెట్టారు. ఈ బిల్లులకు కాంగ్రెస్‌తోపాటు భారత రాష్ట్ర సమితి, భాజపా, మజ్లిస్, సీపీఐలు మద్దతు తెలిపాయి. అలాగే సంగారెడ్డి జిల్లాలో ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటు.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణపై.. తెలంగాణ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు, మున్సిపల్ చట్ట సవరణ బిల్లు, అల్లోపతిక్ ప్రైవేట్ వైద్య సంరక్షణ సంస్థల (రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ) చట్టాన్ని రద్దుచేసే బిల్లులకు సైతం సభ ఆమోదం తెలిపింది. బిల్లుల ఆమోదం సందర్భంగా సభలో పలువురు మంత్రులు, వివిధ పార్టీలకు చెందిన సభ్యులు మాట్లాడారు.

# గణనాథుడికి పూజలు చేసిన కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం వివేకానంద నగర్ డివిజన్ లోని పలు ప్రాంతాలలో వినాయక మండపాలను స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. డివిజన్ పరిధిలోని మాధవరం నగర్ కాలనీ ఏ బ్లాక్ వెల్ఫేర్ అసోసియేషన్, నవభారత వెల్ఫేర్ అసోసియేషన్ వెంకటేశ్వర్ నగర్, ఏఎస్ రాజు నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, ఈనాడు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, వివి నగర్ అపార్ట్మెంట్స్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆల్విన్ కాలనీ ఫేస్ 1 వెల్ఫేర్ అసోసియేషన్, వెంకటేశ్వర్ నగర్ 33 బ్లాక్ రోడ్ నెంబర్ 5, వెంకటేశ్వర్ నగర్ 33 బ్లాక్ రోడ్ నెంబర్ 9, దినబంధు కాలనీ చౌరస్తాలో, లక్ష్మీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, శాంతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్, కూకట్పల్లి శివాలయం పక్క వీధిలో, లక్ష్మీ సాయి అపార్ట్మెంట్ జీవి హైట్స్, ఫ్లాట్ నెంబర్ 360 దగ్గర వివేకానంద నగర్ కాలనీ లలో ఏర్పాటు చేసిన గణనాథులకు పూజలు చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రోజాదేవి మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద కాలనీలలోనూ, అపార్ట్మెంట్లలోనూ ఉన్న సభ్యులందరూ పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారని, ఆ విఘ్నేశ్వరుని ఆశీర్వాదాలు ప్రతి ఒక్కరిపై ఉండేలా ప్రార్థించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినాయక మండపాలను ఏర్పాటు చేసినటువంటి సభ్యులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్ లో ఘనంగా పూజలందుకున్న లంబోదరుడు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ పాత గ్రామపంచాయతీ వద్ద, జర్నలిస్ట్ కాలనీ, మారుతి అలెక్స్ అపార్ట్మెంట్స్ , కొలన్ నారాయణ రెడ్డి కాలనీ తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి లు పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కాలనీవాసులు , భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## చిగుర్ల బ్రదర్స్ ఆధ్వర్యంలో గణనాథుడి వద్ద అన్నదాన కార్యక్రమం..



ప్రజా స్ఫూర్తి, నల్లగొండ : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నల్గొండ పట్టణంలోని ఫ్లైఓవర్ వద్ద 18 వ వార్డులోని రోడ్ నెంబర్ 10 లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఫ్లై ఓవర్ సేన శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై అన్నదాన వితరణ గావించారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాతలు చిగుర్ల సురేష్ సుధీర్ బ్రదర్స్, చిగుర్ల సురేష్, లలిత, సింగం శ్రీనివాస్, శ్రీలత, తేరేటిపల్లి శ్రీనివాసులు, సుజాత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కొండూరు సత్యనారాయణ, యూత్ సభ్యులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు మండలంలోని రొంపెడు చెక్ పోస్ట్ సెంటర్ నందు బిజేపీ మండల అధ్యక్షులు భట్టు రమేష్ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ తల్లిని దూషించిన రాహుల్ గాంధీ వైఖరికి నిరసనగా ఆదివారం ఇల్లందు బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు భట్టు రమేష్ మాట్లాడుతూ మాతృమూర్తి అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ, స్త్రీ అంటే విలువ తెలియని అజ్ఞాని రాహుల్ వాక్యాలకు జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక పార్టీ నాయకత్వ హోదాలో ఉండి ఓ మాతృమూర్తి అలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బానోత్ రమేష్, ఆంజనేయులు, చాట్ల కృష్ణ, రమేష్, యువమోర్చ అధ్యక్షులు రాహుల్ నేత, నాయకులు సందీప్, (పండు) నరసింహారెడ్డి, ప్రశాంత్, భజరందళ్ బొడ్డుపెల్లి అఖిల్, గోరక్షక్ సతీష్ నాయుడు, విశ్వహిందూ పరిషత్ జానకి రామ్, రజత్, నాగరాజు , మండల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## బాపూజీ నగర్ లో ఘనంగా గణపతి ఉత్సవాలు

మేడిపల్లి, ( ప్రజాస్ఫూర్తి) : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాపూజీ నగర్ కాలనీలో గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్,సీనియర్ నాయకులు కాటపాక కుమార్,కాలనీ అధ్యక్షుడు బాల్దె వెంకటేష్,బండారి యాదగిరిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సుభాష్ నాయక్ మాట్లాడుతూ కాలనీవాసులందరు భక్తితో పాటు ఐక్యమత్యాన్ని చాటడం అభినందించదగిన విషయమని అన్నారు..కాలనీ అధ్యక్షుడు బాల్దె వెంకటేష్ మాట్లాడుతూ అయిదు రోజుల పాటు ఘనంగా పూజలు నిర్వహించి అన్నప్రసాదాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి రాజయ్య,కోశాదికారి కన్నె ఉపెందర్,ఉపాధ్యక్షుడు కిష్టయ్య,కాలనీ వాసులు ననుబోతు రాము యాదవ్,జూపల్లి యాదగిరి, సామల రఘు, శ్రీరాముల బాబు, కాటి ఆంజనేయులు,బండారి యాదగిరి,అనిత,జి.రమేష్, విష్ణు, నిమ్మల మల్లేష్,సయ్యద్, శ్యామల్ కుమార్, రాము నాయక్, విష్ణు, యాదమ్మ,చిక్కుడు లక్ష్మీ,కన్నె మానస, నవనీత, వసంత, మౌనిక, లావణ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



### కాంగ్రెస్ అగ్రనేత
## రాహుల్ గాంధీ యాత్రను ఆపేందుకు బిజెపి కుట్ర

* కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి
* రాహుల్ గాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఓట్ చోర్ గద్దే చోర్ నినాదంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్‌లో చేపట్టిన యాత్రను ఆపేందుకు బిజెపి కుట్ర చేస్తోందని కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ చోర్ గద్దె చోర్ బిజెపిని రాహుల్ గాంధీ నిలదీస్తూ యాత్ర చేపడుతుంటే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, దీన్ని జీర్ణించుకోలేక యాత్రను ఆపేందుకు బిజెపి కుట్రలు చేస్తోందని అన్నారు. అందులో భాగంగానే రాహుల్ గాంధీ అనని మాటలను అన్నట్లుగా చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో ఫేక్ వీడియోలు పెడుతూ, అనవసరంగా బిజెపి నిరసన తెలుపుతూ చేస్తోందన్నారు. ఇప్పటికైనా బిజెపి తన బుద్ధిని మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నర్సింలు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు గజ్జల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్ గౌడ్ నాయకులు, కార్యకర్తలున్నారు.



## పాల్వంచ నారాయణ పాఠశాలలో ఘనంగా గణేశ్ నిమజ్జనం ఉత్సవం

* వేలంలో లడ్డూ, బైక్ ర్యాలీ, అన్నదానం
* ఆనందోత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచలోని నెహ్రూనగర్ నారాయణ పాఠశాలలో ఆదివారం గణేష్ నవరాత్రుల సందర్భంగా వినాయకుని నిమజ్జనం కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించబడింది. విద్యార్థులు శ్లోకాలు పఠిస్తూ, గణపతి బప్పా మోరియా నినాదాలతో బైక్ ర్యాలీగా సాగి నిమజ్జన కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణపతి లడ్డు వేలంలో ఉపాధ్యాయురాలు పద్మ విజేతగా నిలిచారు. అనంతరం అన్నదానం నిర్వహించగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కుటుంబసభ్యులు పాల్గొని భక్తిశ్రద్ధలతో గణపతిని వీడారు. డిజీఎం రమణా రెడ్డి మాట్లాడుతూ, ఈ ఉత్సవాలు కులమతాలకు అతీతంగా జరిగి సమాజానికి ఐక్యతను చాటిచెప్పాయని అభిప్రాయపడ్డారు. ఖమ్మం ఏజీఎం రాంకీ మాట్లాడుతూ ప్రజలు భక్తి మార్గం ద్వారా శాంతియుత జీవితాన్ని గడిపే అవకాశాలు ఎక్కువవుతాయని చెప్పారు.ఈ ఉత్సవంలో ఆర్ఐ క్రాంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూరేటి నరసింహారావు, ఉపాధ్యాయులు రామకృష్ణ, పద్మ, మల్లేష్, సుజిత్, దీప్తి, రవీంద్ర, శ్వేత, శైలజ, రహీమా, అఖిల, ఏవో వీర, పీఈటి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూజలందుకున్న విఘ్నేశ్వరుడు



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని విమానపురి కాలనీలో, సంక్షేమ సంఘం వారు ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం. ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విమానపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సుధాకర్ గౌడ్, సలహాదారులు జిట్టా రామేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి జిట్టా బలవంత్ రెడ్డి, కోశాధికారి అరుణ్ కుమార్, కృష్ణ గౌడ్, బలరాం రాజు, రామారావు, హనుమంతరావు, సాయి,మనీ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ నాయక్ నగర్ లో ఘనంగా పూజలందుకున్న ఏకదంతుడు



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : గణేష్ నవరాత్రుల్లో భాగంగా సుభాష్ నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్ నగర్ మోడీ అపార్ట్మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నే రాజు, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ , రాష్ట్ర బీఆర్ఎస్వి నాయకులు మన్నే గుణేష్ ముదిరాజ్ లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ ఆలూరు వెంకట శేషాచారి , పివీ భాస్కర్ రెడ్డి, హరిబాబు యాదవ్ , మోడీ అపార్ట్మెంట్స్ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడి కృపతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి..

* మాజీ ఉప సర్పంచ్ ఎం. కృష్ణ
* అన్నధాతలకు ఘన సన్మానం



అందోలు, ప్రజాస్ఫూర్తి: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అందోలు మండలం కన్సాన్పల్లి గ్రామంలో దుర్గా భవాని ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. అన్నదానం ఏర్పాటు చేసిన దాతలకు ఘన సన్మానం నిర్వహించారు. మాజీ ఉప సర్పంచ్ కృష్ణ వినాయకుడి పూజలో పాల్గొని ఆ ఘననాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంధర్బంగా ఆయన మాట్లాడుతూ ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సకల విఘ్నాలు తొలిగి సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటిసి బాలయ్య, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు వీరన్న, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఈశ్వరయ్య, భజరంగ్ దళ్ సభ్యులు దేవునూరి శ్రీశైలం, జోగాల గోవర్ధన్,కాడెం శ్రీనివాస్, కాల్వమీది రమేష్, రామన్నగారి జై రాములు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

*** సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేష్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని సర్కిల్ ఇన్స్పెక్టర్ కొండపర్తి నరేష్ పేర్కొన్నారు. కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం స్టేడియం గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ఫ్రెండ్స్ కప్ క్రికెట్ మ్యాచ్‌లో మీడియా లెవెన్, న్యాయవాదుల జట్టు ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.పి.ఏ) జట్లు తలపడ్డాయి. మ్యాచ్ అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐ నరేష్, విజేతలైన ఐ.ఎల్.పి.ఏ జట్టుకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రతి పోటీలో గెలుపు ఓటములు సహజం. సమాజహితం కోసం నిరంతరం కృషి చేసే న్యాయవాదులు, మీడియా ప్రతినిధులు ప్రొఫెషనల్ క్రీడాకారుల్లా ఆడటం హర్షణీయం. క్రీడలు మనసుకు ఉల్లాసాన్ని కలిగించడంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయి"



అన్నారు.ముందుగా బ్యాటింగ్ చేసిన ఐ.ఎల్.పి.ఏ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 162 పరుగులు చేసింది. ఓపెనింగ్ జోడీగా రాధాకృష్ణ, చిన్నికృష్ణ 58 పరుగుల భాగస్వామ్యంతో మంచి శుభారంభం ఇచ్చారు. అనంతరం బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్, చురుకైన ఫీల్డింగ్ ప్రదర్శించడంతో మీడియా లెవెన్ జట్టు 123 పరుగులకే పరిమితమై, ఐ.ఎల్.పి.ఏ జట్టు 39 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.ఈ కార్యక్రమంలో జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ న్యాయవాది యెర్రా కామేష్, న్యాయవాదులు జె.గోపికృష్ణ, సాదిక్ పాషా, మారపాక రమేష్, చిన్నిక్రిష్ణ, దారావత్ రాధాకృష్ణ, వడ్లకొండ హరి, సామంత్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థలో పదవి విరమణ పొందుతున్న మిత్రులకు ఘన సన్మానం



ప్రజాస్ఫూర్తి , ఇల్లందు : సింగరేణి సంస్థలో 38 సంవత్సరాలు సేవలందించిన ఇల్లందు జెకె మెయిన్ ఓసి లో సేవలందించి ఆదివారం పదవి విరమణ పొందుతున్న మిత్రుడు వారి కుటుంబ సభ్యులలో ఒకరు అయినటువంటి *కుమార్ సింగ్ (బోలా) *పదవి విరమణ సందర్భంగా వారిని వారి కుటుంబ సభ్యులను పూలమాలతో , శాలువాతో సన్మానించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు పలు సన్నిహితులు పదవీ విరమణ సందర్భంగా వారిని ఇల్లందు మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మడత వెంకట్ గౌడ్, సుదర్శన్ కోరి, బాణాల శ్రీనివాస్ లు పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

## సర్పాలను అడవిలో విడిచిపెట్టిన ప్రాణధార ట్రస్ట్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పట్టిన సర్పాలను ప్రాణధార ట్రస్ట్ స్నేక్ రెస్క్యూ సభ్యులు ఆదివారం అడవిలో వదిలిపెట్టారు.ఈ సందర్భంగా ప్రాణధార ట్రస్ట్ అధ్యక్షుడు, కొత్తగూడెం కార్పొరేషన్ స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్ మాట్లాడుతూ "భద్రాద్రి కొత్తగూడెం ఏజెన్సీ ప్రాంతం కావడంతో సర్పాల సమస్య ఎక్కువగా ఉంటుంది. రోజూ మా హెల్ప్‌లైన్‌కు ఇళ్లలోకి పాములు వచ్చాయని ఫోన్లు వస్తున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో నీటి ప్రవాహం వల్ల పాములు తమ ఆవాసాలు కోల్పోయి ఇళ్లలోకి వస్తాయి" అని తెలిపారు. ఈ కాలంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా రాత్రిపూట నేలపై నిద్రించడం మానుకోవాలని, ఇంటి కిటికీలు, తలుపులకు సన్నని జాలి అమర్చుకోవాలని, రాత్రివేళల్లో టార్చ్‌లైట్ తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రాణధార ట్రస్ట్ స్నేక్ రెస్క్యూ సభ్యులు మధు, మహేష్, దత్తు, ముజఫర్, సంగయ్య, ప్రవీణ్ పాల్గొని జిల్లాలోని పలు ప్రాంతాల్లో పట్టిన పాములను సురక్షితంగా అడవిలో వదిలారు.

## క్వారీ గుంతలో యువకుడి మృతదేహం లభ్యం

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కొంపల్లి జయభేరి పార్క్ ప్రాంతంలోని క్వారీ గుంతలో ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..... కరీంనగర్ జిల్లా కు చెందిన మహమ్మద్ సహీద్ (17) జీవనోపాధి కోసం సుమారు ఐదు సంవత్సరాల క్రితం కరీంనగర్ జిల్లా నుండి కుటుంబం హైదరాబాద్‌కు వలస వచ్చి, ప్రస్తుతం హస్మత్‌పేట్ లో నివసిస్తూ చిన్నచిన్న వ్యాపారాల ద్వారా జీవనం సాగిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే పేట్‌బషీరాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని వెలికి తీసి, కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. విచారణలో భాగంగా మృతుడు మహమ్మద్ సహీద్ అని తెలిసింది. యువకుడి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలెక్టర్, కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయాల్లో ప్రజావాణి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ప్రజలకు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచనలు జారీ చేశారు. జిల్లాలోని భూసమస్యల పరిష్కారానికి ప్రజలు సుదూర ప్రాంతాల నుండి సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నందున, వారి సౌకర్యార్థం డివిజన్ల వారీగా ప్రజావాణి నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. భద్రాచలం డివిజన్ పరిధిలోని ప్రజలు - భూసమస్యల పరిష్కారం కోసం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ప్రజావాణి నిర్వహిస్తారు. కొత్తగూడెం డివిజన్ పరిధిలోని ప్రజలు - భూసమస్యల పరిష్కారం కోసం కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ప్రజావాణి నిర్వహిస్తారు. జిల్లా ప్రజలందరూ తమ డివిజన్ పరిధి ప్రకారం సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించి, భూసమస్యల పరిష్కారానికి ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో అధిక వర్షపాతం ఉన్నందున ప్రజల సౌకర్యార్థం




ఈ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.




## కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

*** కొత్తగూడెం పోస్టర్ ఆవిష్కరణలో ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. సీతారామయ్య**

ప్రజాస్ఫూర్తి,భద్రాద్రికొత్తగూడెం:కాంట్రాక్టు,ఔట్సోర్సింగ్, స్కీం కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనం నెలకు 26వేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 7న హైదరాబాదులో జరిగే ఐ ఎఫ్ టి యు సదస్సును జయప్రదం చేయాలని ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె సీతారామయ్య కార్మికులకు పిలుపునిచ్చారు.ఆదివారం కొత్తగూడెం ఐఎఫ్టియు కార్యాలయంలో సదస్సు ప్రచార పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగ, ఉపాధి భద్రత,పని స్థలాల్లో రక్షణ,సమానపనికి సమాన వేతనం,8గంటల పని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులతో పాటు ఆశ,అంగన్వాడి మిడ్ డే మీల్స్, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ కార్మికులతో ప్రభుత్వాలు వెట్టి చాకిరి చేయిస్తూ శ్రమ దోపిడికి పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు.ఈ సమస్యల పరిష్కారానికై సెప్టెంబర్ 7న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు సదస్సుకు వివిధ రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఐఎఫ్టియు ఏరియా అధ్యక్ష కార్యదర్శులు మోత్కూరి మల్లికార్జున రావు,ఎన్ సంజీవ్,శరత్,అవినాష్, రాధ ,కృష్ణ,సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



## సత్తా చాటిన బాల లింగంకు ఘన సన్మానం

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఓ వైపు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడమే కాకుండా మరోవైపు ఎల్ఎల్ఎంలో ర్యాంక్ సాధించిన ముస్తాబాద్ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన శివ్వని బాల లింగంను గ్రామస్తులు, యువకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. బాల లింగం కానిస్టేబుల్ పిటిఓలో స్టేట్ 7వ ర్యాంక్ సాధించాడు. అంతేగాకుండా ఎల్ఎల్‌బిలో స్టేట్ 2130వ ర్యాంక్, ఎల్ఎల్ఎంలో 600 ర్యాంక్ సాధించాడు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామస్తులు, యువకులు బాల లింగకు శాలువా కప్పి, మిఠాయి తినిపించి అభినందనలు తెలిపారు. యువకులు బాల లింగంను ఆదర్శంగా తీసుకొని జీవితంలో కష్టపడి ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బాల కిసాన్, నగునూరి చందు, రాజు, కర్రోళ్ల నవీన్, చింతకింది సుధీర్, గూడెపు అశోక్, చరణ్, కార్తీక్, సతీష్, తేజ, నందు, ప్రభాస్, ఏర్పుల సాయి, అభిషేక్ తదితరులున్నారు.



## ఘనంగా పూజలందుకున్న గణనాథుడు

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : హెచ్ఎఎల్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో కూకట్ పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు , ఎమ్మెల్సీ నవీన్ రావు, కార్పొరేటర్ జూపల్లి, కంచనపల్లి నాగరాజు లు ముఖ్య అతిథులుగా హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తిరుపతి రావు, వసంత రావు, లక్ష్మణ్ కుమార్, రమేష్ రెడ్డి, శివ సుందర్, సురేష్ సోమేశ్వర్ రావు, శంకర్ రావు, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వినాయకుడి నిమజ్జనం..

**- అడుగడుగునా గణపయ్యకు మంగళ హారతులతో మొక్కులు**



అందోలు, ప్రజాస్ఫూర్తి: మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామ శివాలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయక నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఐదు రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథులు అదివారం గంగమ్మ ఒడికి చేరారు. ఓకే సారి ఇప్పుడు చిన్ని గణపయ్య విగ్రహాలను డప్పు చప్పుళ్ల హోరు.. డిజే పాటలు,యువతీ యువకుల నృత్యాలు, పిల్లల కేరింతల నడుమ శోభాయాత్రలు కనుల పండువగా సాగాయి.'జై బోలో గణేశ్ మహరాజ్‌కీ.. గణపతి బొప్పా' నినాదాలతో వీధులన్నీ మార్మోగాయి. మహిళలు మంగళహారతులతో తరలివచ్చి లంబోదరుడికి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ సమీపంలోని కొండర్ చెరువులో నిమజ్జనం చేసి.. వెళ్లిరా గణపయ్య అంటూ వీడ్కోలు పలికారు. ఫ్రెండ్స్ యూత్ సభ్యులు వని మోహన్, రామన్నగారి కృష్ణమూర్తి, వని అనిల్, వని ప్రవీణ్, వని నవీన్, చాకలి విష్ణు, కాల్వమీది రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూజలందుకున్న గణనాథుడు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : గణేష్ నవరాత్రి ఉత్సవాలు భాగంగా 5 రోజు పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సోమయ్య నగర్, మగ్దూం నగర్, జగద్గిరి నగర్ లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి యువజన నాయకులు కొలుకుల జైహింద్ ముఖ్యఅతిథిగా హాజరై విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణేష్ కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, రాజ్ కుమార్, ప్రసాద్, రేణుక యాదవ్, అండాలు, రాజశేఖర్, ప్రకాష్, వెంకటేష్, మైలారం రాజు, శ్రీనివాస్ చారి, బాబురావు, రంజిత్, రాకేష్, వారి మిత్ర బృందం పాల్గొన్నారు.

# కామ్రేడ్ సలీం ప్రజా సంఘాల నిర్మాణం కోసం ఎంతో కృషి చేశారు

*** సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి సత్యం**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ మండల సిపిఎం సీనియర్ నాయకులు గాజులరామారం డివిజన్ పార్టీ శాఖ మాజీ కార్యదర్శి కామ్రేడ్ సలీం కుత్బుల్లాపూర్ ప్రాంతంలో పార్టీ విస్తరణ కోసం ప్రజా సంఘాల నిర్మాణం కోసం ఎంతో కృషి చేశారని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్, పి సత్యం అన్నారు. కుత్బుల్లాపూర్ మండల సిపిఎం సీనియర్ నాయకులు గాజులరామారం డివిజన్ పార్టీ శాఖ మాజీ కార్యదర్శి కామ్రేడ్ సలీం సంస్మరణ సభ ఆదివారం రోడా మేస్త్రి నగర్ బి భగత్ సింగ్ విగ్రహం దగ్గర పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. సంస్మరణ సభలో కామ్రేడ్ సలీం పాల్గొని మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పేదల ఇళ్ల స్థలాల కోసం పోలీసుల లాఠీలను సైతం



లెక్కచేయకుండా ముందు వరుసలో ఉండి పోరాడిన నాయకుడని అన్నారు. అలాంటి నాయకున్ని కోల్పోవడం వామపక్ష ఉద్యమానికి ప్రధానంగా సిపిఎం పార్టీకి ఈ ప్రాంతంలో తీరని లోటని, ఆయన పార్టీ కోసం పని చేస్తూనే తన కుటుంబ సభ్యులందరినీ పార్టీలోకి తీసుకొచ్చిన త్యాగధనుడు సలీం అని అన్నారు. తన పనితో పాటు పార్టీ పని కూడా ఇంటి పని లాగా భావించి పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపులో పాల్గొనేవాడని అన్నారు పార్టీ జిల్లా కమిటీ సలీం కుటుంబానికి ఎల్లవేళల అండదండగా ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి లింగస్వామి, మండల కమిటీ సభ్యులు బి సత్యం, పసుల అంజయ్య, రావుల స్వాతి, కామ్రేడ్ సలీం కుమారులు కామ్రేడ్ జాకీర్ హుస్సేన్ ,కామ్రేడ్ ఆరిఫ్ పార్టీ నాయకులు శంకర్, టీవీఎస్ రమణ ,లక్ష్మి , ముక్తార్ లక్ష్మణరావు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు

## బీసీ రిజర్వేషన్లపై ఏకగ్రీవ తీర్మానం చేయడం మంచి పరిణామం: నారాయణ



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై ఏకగ్రీవ తీర్మానం చేయడం మంచి పరిణామమని సీపీఐ నేత నారాయణ అన్నారు. లోపల కొంత మందికి ఇష్టం లేకపోయినా బహిరంగంగా మద్దతు తెలిపారన్నారు. ముఖ్యమంత్రిగా పదేళ్లు పాలించిన కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి మద్దతు ఇస్తే బాగుండేదన్నారు. ఇంత మంచి చట్టం చేసినప్పుడు అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌లో ఉండటం సరికాదన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బరిలో ఉన్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్ధతుపై కేసీఆర్ స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు.

## అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ



హైదరాబాద్: అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. సోమవారం గవర్నర్ వద్దకు రావాలని కోరారు. ఇదే విషయంపై భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పలువురు ఎమ్మెల్యేలను ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో ఆయన కలిశారు. కేసీఆర్‌కు రాసిన లేఖను వారికి అందజేశారు.

## ఒడిశా వైద్యుడి ఔదార్యం.. 45 ఏళ్లుగా ఉచిత వైద్యం!



బ్రహ్మపుర: ఎనిమిది పదుల వయసులోనూ రోగులకు ఉచిత వైద్యం చేస్తున్నారు. దాదాపు 45 ఏళ్లుగా గిరిజనులకు, వెనుకబడిన ప్రాంతాల వారికి నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారు. ఆయనే ఒడిశాలోని బ్రహ్మపురకు చెందిన వైద్య నిపుణుడు డా.కృష్ణమోహన్. అందరికి అందుబాటులో వైద్యం కోసం జీవితాన్ని ధారపోసిన ఆయన.. తన కృషికి గుర్తింపుగా 2004లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా ఉత్తమ సర్జన్‌గా జాతీయ అవార్డు, 2021లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. ఒడిశాలోని సుకుందా గ్రామంలో 1939 ఆగస్టు 1న జన్మించిన డా.కృష్ణమోహన్ ప్రయాణం.. కటక్‌లోని ఎస్‌సీబీ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ పట్టాతో మొదలైంది. అనంతరం ఇంగ్లాండ్‌లో ఎంఎస్ పట్టా పొందారు. 197275 వరకు కామన్వెల్త్ మెడికల్ ఫెలోగా విధులు నిర్వహిస్తూ.. రాడ్‌క్లిఫ్ ఇన్‌ఫర్మరీ వంటి ప్రతిష్ఠాత్మక ఆస్పత్రుల్లో గుర్తింపు పొందారు. ప్రొఫెసర్ పదవి ఇస్తామన్న హామీ లభించినప్పటికీ.. స్వదేశానికి తిరిగివచ్చారు. బుర్లాలోని విమ్‌సార్, బ్రహ్మపురలోని ఎంకేసీజీ వైద్యకళాశాల, కలకత్తా, పట్నా విశ్వవిద్యాలయాల్లో కీలక పదవులు నిర్వహించారు. తన తండ్రి స్ఫూర్తితో 1970ల్లో గిరిజన ప్రాంతాల్లో ఉచిత వైద్య సేవలు ప్రారంభించారు. 1979-80 నుంచి మొదలు.. 25 ఏళ్లపాటు బంతపల్లి, మహుదా, మాధాపుర్ వంటి ప్రాంతాల్లో ప్రతి ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. పీజీ వైద్యవిద్యార్థులు, వివిధ విభాగాలు వైద్యులు సహకారంతో కంటి చికిత్సలు, సర్జరీలు చేపట్టారు. పదవీ విరమణ అనంతరం కూడా.. స్వగ్రామంలోని ఇంట్లో క్లినిక్‌ను ఏర్పాటు చేసి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ఆయన కుమారుడు బిభుప్రసాద్ సైతం తన ఇంజినీరింగ్ కెరీర్‌ను విడిచిపెట్టి.. తండ్రి బాటలో పయనిస్తున్నారు.



## ఐదోరోజు పూజలందుకున్న ఘననాథుడు..

*** దుర్గమ్మ ఆలయం వద్ద మహా అన్నదానం**

అందోలు, ప్రజాస్ఫూర్తి: గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కన్ సాన్ పల్లి గ్రామంలో దుర్గా భవాని దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన మహా గణపతి ఐదో రోజు ఘనంగా పూజలందుకునాడు. నోమన్నగా ధీరాజ్ రెడ్డి దంపతుల చేతుల మీదుగా గ్రామ పురోహితులు ఆనంద్ శర్మ పూజలు నిర్వహించారు.గణపతి కుంకుమర్చన కార్యక్రమాన్ని వైభవంగా కన్నులవిందుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద మాజీ సర్పంచ్ చిలుకంటి వెంకటేశం, మాజీ ఉపసర్పంచ్ మొరబోయిన కృష్ణ, ధీరాజ్ రెడ్డి, కలపల్లి ప్రభు ల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ అన్నప్రసాద కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గణపతి ఆశీస్సులు ప్రజల అందరిపైనా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని దుర్గా భవాని కమిటీ ఆకాంక్షించారు. అన్నదానానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేరి మాణిక్ రెడ్డి, మాజీ ఎంపీటిసి బాలయ్య, నోమన్నగారి వెంకట్ రెడ్డి, నర్సింహా రెడ్డి, మాధవ్ రెడ్డి, హన్మంత్ రెడ్డి, బీజేపీ నాయకులు కల్వమీది రమేష్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మొరబోయిన ఈశ్వరయ్య, వని దుర్గేష్, భజరంగ్ దళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



## ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదం

**: కార్పొరేటర్లు**

*** వైఎంఎస్ కాలనీలో విక్టరీ మార్షల్ ఆర్ట్స అకాడమీ ప్రారంభం**

జగద్గిరిగుట్ట , (ప్రజాస్ఫూర్తి) : ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని చింతల్ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ రషీదా రఫీ, రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బుద్ద విజయ్ శేఖర్ గౌడ్ అన్నారు. గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధిలోని వైఎంఎస్ కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన విక్టరీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ని వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అకాడమిలో క్లాసికల్, వెస్ట్రాన్ డ్యాన్స్ శిక్షణతో పాటు కరాటే, మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అకాడమీకి సంబంధించిన కమిటీ సభ్యులందరికీ హార్దిక శుభాభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ తంగా లక్ష్మారెడ్డి , దేగల కృష్ణ మూర్తి, భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొండల శ్రీనాథ్ రావు , కామ్రేడ్ బి సత్యం , కరాటే మాస్టర్ కావలి ఎల్లేష్ గౌడ్, బిసు వెంకటేశం గౌడ్, భగత్ సింగ్ నగర్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు సామ్రాట్, బాల్నే.రమేష్, గౌడ్ , పచ్చిమట్ల నరేందర్ గౌడ్, రాము, రాజిరెడ్డి, బత్తిని కుమార్ గౌడ్,మడ్డి వెంకటేష్ గౌడ్,శ్రీధర్ గౌడ్,సత్తి రెడ్డి, బత్తిని సాయి కిరణ్ గౌడ్, శ్రీనివాసులు రెడ్డి , ప్రేమ్, కుమార్ యాదవ్ , సదల రమేష్, లింగం గౌడ్ , మధు గౌడ్, మహేష్,నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 660 పేజీల నివేదికపై అరగంటలో మాట్లాడమంటే ఎలా?

**: హరీశ్‌రావు**

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేసి, మాకు మాట్లాడే అవకాశం ఇవ్వరా? అని ప్రశ్నించారు. 660 పేజీల నివేదికపై అరగంటలోనే అన్నీ మాట్లాడాలంటే ఎలా? ఇది సాధ్యమయ్యే పనేనా?అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై చర్చ సందర్భంగా హరీశ్‌రావు అసెంబ్లీలో మాట్లాడారు. కమిషన్ నివేదికపై రేపు, ఎల్లుండి కూడా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. "నాకు రెండుగంటల సమయం ఇవ్వాలి. మధ్యలో జోక్యం చేసుకోవద్దు. ఆదివారం రోజు సభలో నివేదిక పెట్టారంటేనే వారి ఉద్దేశం అర్థమవుతోంది. కోర్టుకు వెళ్లడం మాకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు. గతంలో ఇలాంటి విషయాలపై ఇందిరాగాంధీ, అద్వాణీ కూడా కోర్టుకు వెళ్లారు. ఆదరాబాదరాగా ఆదివారం సభలో పెట్టారంటేనే మీ కుట్రలు అర్థమవుతున్నాయి. మీరు చేసిందంతా పొలిటికల్ డ్రామా అని తెలుస్తోంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ దర్యాప్తు నిష్పాక్షికంగా జరిగిందా? లేదా? తేలాలి. నిష్పాక్షికంగా జరగకపోతే ఆ కమిషన్ నివేదిక చిత్తుకాగితమని సుప్రీం కోర్టు చెప్పింది. అరోపణలపై కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్‌లో స్పష్టంగా చెప్పారు. సభ్యులకు 8బి, 8సి కింద నోటీసులు



ఇవ్వాలని చట్టంలో స్పష్టంగా ఉంది. 8బి కింద నోటీసులు ఇవ్వకపోతే ఆ కమిషన్ నివేదికలు చెల్లవని సుప్రీంకోర్టు చెప్పింది.ఎమర్జెన్సీపై విచారణ జరపాలని షా కమిషన్ వేశారు. దానిపై దేశమంతా కాంగ్రెస్ నేతలు గగ్గోలు పెట్టారు. షా కమిషన్‌ను ఆనాడు నోటికి వచ్చినట్లు కాంగ్రెస్ నేతలు తిట్టారు. చట్టాలను తుంగలో తొక్కుతూ ఏకపక్షంగా ఈ కమిషన్ ఇచ్చారు. 8బీ నోటీసులు ఇవ్వకుండా నివేదిక ఇచ్చారని ఆ రోజు సుప్రీం కోర్టు కొట్టేసింది. మాపై వేసిన ఈ కమిషన్ కూడా రాజకీయ ప్రేరేపితం, కుట్రే. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కూడా కోర్టులో నిలబడదు. ఇది డొల్ల రిపోర్టు. హక్కులకు భంగం కలిగినప్పుడు ఎవరైనా కోర్టుకు వెళ్తారు. నివేదికను రద్దు చేయాలనే కోర్టుకు వెళ్లాం. అసెంబ్లీలో చర్చించవద్దని కోరలేదు" అని హరీశ్‌రావు అన్నారు.

## ఘనంగా పూజలందుకున్న లంబోదరుడు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రంగారెడ్డినగర్ డివిజన్ విజయనగర్ కాలనీలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణ నాథుడికి స్థానిక కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మరాఠా కోటా.. ఏమిటీ 'హైదరాబాద్ గెజిట్'?



మరాఠాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సామాజిక కార్యకర్త మనోజ్ జరాంగే చేస్తున్న ఉద్యమం తీవ్రరూపం దాలుస్తోంది. మరాఠాలను కున్బీలుగా గుర్తించాలన్న ఆయన.. హైదరాబాద్, సతారా గెజిట్‌లను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ కూడా వీటిని అమలు చేయడంలో న్యాయపరమైన చిక్కులపై అభిప్రాయాలను కోరుతున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో మరాఠా కోటా విషయంలో కీలకంగా మారిన ఈ హైదరాబాద్ గెజిట్ ఏంటనే విషయాన్ని పరిశీలిస్తే.. హైదరాబాద్ గెజిట్ అనేది 1918లో నాటి నిజాం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు. అప్పట్లో హైదరాబాద్ రాష్ట్రంలో మరాఠా సామాజిక వర్గం ఎక్కువగా ఉండేదని.. అయినప్పటికీ ఉద్యోగాలు, పాలనలో వారిని నిర్లక్ష్యం చేశారనే వాదన ఉండేది. ఈ సమస్యను పరిష్కరించేందుకు నాటి నిజాం ప్రభుత్వం.. మరాఠా వర్గాన్ని 'హిందూ మరాఠాలు'గా గుర్తిస్తూ వారికి విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించింది. దీన్ని అధికారిక గెజిట్‌లోనూ పేర్కొంది. ఇదే హైదరాబాద్ గెజిట్‌గా ప్రాచుర్యం పొందింది. మరాఠా సామాజిక వర్గం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉందని అధికారిక రికార్డుల్లోనే పొందుపరిచారని వాదిస్తున్న మరాఠా కోటా ఉద్యమకారులు.. చారిత్రక వాస్తవాల ఆధారంగా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మహారాష్ట్ర జనాభాలో మరాఠాలు 28 శాతంగా ఉన్నట్లు ప్రభుత్వం గతంలో పేర్కొంది. వీరిని ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీ) జాబితాలో చేర్చి, 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని జరాంగే డిమాండ్ చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం మాత్రం కున్బీలుగా గుర్తించే విషయంపై సుప్రీం కోర్టు గతంలో కీలక వ్యాఖ్యలు చేసిందని చెబుతోంది. మరాఠాలు, కున్బీలు ఒకే వర్గం కాదని సర్వోన్నత న్యాయస్థానం చెప్పిన విషయాన్ని ధిక్కరించలేమని, ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాల్సి ఉన్నందున చర్చలు జరిపేందుకు సిద్ధంగానే ఉన్నామని వెల్లడించింది.

## హూతీల ప్రధాని హతమైన వేళ.. ఐరాస కార్యాలయాలపై 'దాడులు'

యెమెన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో హూతీల ప్రభుత్వ ప్రధాని అహ్మద్ అల్‌రహావీతోపాటు పలువురు మంత్రులు హతమైన విషయం తెలిసిందే. దీంతో హూతీలు దేశ రాజధాని సనాలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలోనే నగరంలోని ఐరాస కార్యాలయాల్లో దాడులు నిర్వహించారు. ఓ సిబ్బందిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఐరాసకు చెందిన యూనిసెఫ్, వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం కార్యాలయాలపై హూతీలు దాడులు చేశారని ఐరాస ప్రతినిధులు ధ్రువీకరించారు. ఆ రెండు సంస్థలకు చెందిన అనేక సిబ్బందితో సంబంధాలు తెగిపోయాయని, వారిని కూడా నిర్బంధించి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. తమ ఆధీనంలోని ప్రాంతాల్లో పనిచేస్తున్న ఐరాస, ఇతర అంతర్జాతీయ సంస్థలపై హూతీలు దీర్ఘకాలంగా అణచివేత చర్యలకు పాల్పడుతున్నారు. యెమెన్‌లో సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్న హూతీలను ఇజ్రాయెల్ ఇటీవల కోలుకోలేని దెబ్బతీసింది. రెబల్ ప్రభుత్వ ప్రధాని అహ్మద్ అల్ రహావీ, ఉపప్రధాని మహమ్మద్ అల్‌మేదానీ, మంత్రులు అబ్దెల్ మాజీద్ అల్‌ముర్తదా, గమాల్ ఆమెర్, అలీ సెయిఫ్, అలీ అల్‌యాఫీ తదితరులను మట్టుబెట్టింది.

# డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: డ్యామ్‌కు, బ్యారేజీకు తేడా లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చేశారని ఎన్‌డీఎస్‌ఏ నివేదికలో ఉందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మేడిగడ్డలో పూర్తి నీరు నిల్వ చేసి కూలిపోయేందుకు కారణమయ్యారని పేర్కొన్నారు. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ నివేదికపై ఉత్తమ్ కుమర్‌రెడ్డి సభలో చర్చను ప్రారంభించారు. "తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రూ.87,449 కోట్లతో చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్టు కాళేశ్వరం. కానీ, మేడిగడ్డ.. సుందిళ్ల, అన్నారం నిరుపయోగంగా మారాయి. ప్రాణహితచేవెళ్లకు పేరు మార్చి కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయలాంటి మేడిగడ్డ దెబ్బతింది. 3 బ్యారేజీలు 20 నెలలుగా నిరుపయోగంగా మారాయి. ప్రాణహిత చేవెళ్ల డిజైన్లను అప్పటి సీఎం మార్చారని కమిటీ చెప్పింది. మేడిగడ్డలో బ్యారేజీ నిర్మించవద్దని వ్యాప్కోస్ నిపుణులు కూడా చెప్పారు. రూ.38వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును పక్కన పెట్టి.. రూ.1.47లక్షల కోట్లతో కాళేశ్వరం మొదలుపెట్టి..రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టారు. 2019 నుంచి 2023 వరకు లిఫ్ట్ చేసినవి 162 టీఎంసీలు మాత్రమే. కాళేశ్వరం నుంచి ఏడాదికి 20.2 టీఎంసీలు మాత్రమే లిఫ్ట్ చేశారు. బ్యారేజీలకు జరిగిన నష్టం రాష్ట్రానికి పెనుభారంగా మారింది.



రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదు. స్వాతంత్ర్యం వచ్చాక ఇలాంటి విపత్తు ఏ రాష్ట్రంలోనూ జరగలేదు. మేడిగడ్డ బ్యారేజీ కుంగినప్పుడు భారత రాష్ట్రసమితి ప్రభుత్వమే అధికారంలో ఉంది. ఎన్‌డీఎస్‌ఏపై భారత రాష్ట్రసమితి నేతలు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బిల్లు తెచ్చినప్పుడు భారత రాష్ట్ర సమితి మద్దతిచ్చింది" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి వివరించారు.

## బీసీ బిల్లులకు భారత రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు: కేటీఆర్

హైదరాబాద్: బీసీ బిల్లులకు భారత రాష్ట్ర సమితి సంపూర్ణంగా మద్దతు తెలుపుతోందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. శాసనసభలో పురపాలక, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. "బీసీల కోసం గతంలో కేసీఆర్ అనేక పోరాటాలు చేశారు. ఓబీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కోరారు. తెలంగాణ మొట్టమొదటి స్పీకర్‌గా బలహీనవర్గాల బిడ్డ మధుసూదనాచారిని, శాసన మండలి తొలి ఛైర్మన్‌గా స్వామిగౌడ్‌ను నియమించాం. అడ్వకేట్ జనరల్‌గానూ బలహీనవర్గానికి చెందిన బీఎస్ ప్రసాద్‌ను భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం నియమించింది.



కె.కేశవరావు, డి.శ్రీనివాస్ (డీఎస్), బండా ప్రకాశ్, లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్రను రాజ్యసభకు నామినేట్ చేశాం" అని కేటీఆర్ పేర్కొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికను ఎమ్మెల్యేలకు పెన్‌డ్రైవ్‌లో అందించిన ప్రభుత్వం

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకుపై జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ నివేదికను ప్రభుత్వం ఎమ్మెల్యేలకు పెన్‌డ్రైవ్‌లో అందజేసింది. ప్రధానంగా 3 ఆనకట్టల ప్రణాళిక, నిర్మాణంలో లోపాలు, తప్పిదాలు ఉన్నాయని నివేదిక తేల్చింది. అంచనాల తయారీ, పరిపాలన అనుమతుల్లో లోపాలు ఉన్నాయని పేర్కొంది. ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ అనుమతుల్లోనూ లోపాలు ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది. "నిపుణుల కమిటీ ప్రకారం మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించరాదు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేనందునే మేడిగడ్డ నిర్మించారనడం సహేతుకం కాదు. అప్పటి సీఎం కేసీఆర్ నిర్ణయం ప్రకారమే మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌లు నిర్మించారు. ఆనకట్టల నిర్మాణానికి ఇచ్చిన కాంట్రాక్ట్ విధానం సరికాదు.



డీపీఆర్ పూర్తిగా పరిశీలించకుండానే అంచనాలు ఆమోదించారు. కాంట్రాక్టర్ల లబ్ధికే అంచనాల పెంపు నిబంధనలు సడలించారు. ఏజెన్సీలకు లబ్ధి చేకూర్చాలన్న దురుద్దేశంతోనే అంచనాలు సవరించి ఖజానాకు నష్టం చేకూర్చారు. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ నిర్వహణ సరిగా లేదు. ఆనకట్టల డిజైన్లు, డ్రాయింగ్స్‌లో పూర్తిగా లోపాలున్నాయి. మేడిగడ్డకు సబ్‌స్టాన్షియల్ సర్టిఫికెట్ ఇవ్వడం అక్రమం" అని జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ నివేదికలో పేర్కొంది.

## ఎంత రాత్రివరకైనా అసెంబ్లీలో ఉంటాం



కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం దొంగచాటుగా అసెంబ్లీలో బిల్లులు ప్రవేశ పెడుతోందని విమర్శించారు. రైతులు యూరియాతో ఇబ్బంది పడుతున్న సందర్భంలో, వినాయక చవితి ఉత్సవాలు జరుగుతున్న సందర్భంలో కూడా మేము సభకు హాజరు అయ్యామని అన్నారు. ఒకవైపు అసెంబ్లీలో పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చకు నిర్ణయించి.. సీఎం రేవంత్ రెడ్డ కేరళకు వెళ్లారని విమర్శించారు. కాంగ్రెస్ హైకమాండ్‌ను ప్రసన్నం చేసుకోవడం మీదున్న దృష్టి ప్రజలపై లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే సభ పెట్టారని అన్నారు. కాళేశ్వరం నీళ్లు వాడుకుంటూనే నింద వేసే ప్రయత్నం చేస్తున్నారని సీరియస్ అయ్యారు. 'హైకోర్టు మొట్టికాయలు వేసిన తర్వాత సుమారు 665 పేజీల నివేదిక ఇచ్చారు. ఈరోజే ఇస్తే చదువుకుని సమాధానం ఎలా చెప్పాలి. ఇది రాజకీయ నీతి అనిపించుకోదు. సొంత పార్టీ నేతల సలహాలు తీసుకోని స్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. అధికార మదంతో నాకు తిరుగులేదు అనేలాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో మాకు మైక్ కట్ చేయకుండా ఇస్తే.. రాత్రి వరకైనా చర్చలో పాల్గొంటామని ప్రకటించారు.

## కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై సభలో చర్చ జరగాలి

**: భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్**

హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు భాజపా సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. పురపాలక చట్ట సవరణ బిల్లుపై శాసనసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. "ఇవాళ సభలో పెట్టిన బిల్లుకు సంపూర్ణ మద్దతిస్తున్నాం. రాష్ట్రంలో బీసీలకు ఉన్న అనుమానాలను ప్రభుత్వం నివృత్తి చేయాలి. కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై సభలో చర్చ జరగాలి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలైంది. కామారెడ్డి డిక్లరేషన్ తర్వాత బీసీలంతా ఆశపడ్డారు. మంత్రివర్గంలో బీసీల సంఖ్య ఎంత? బీసీల్లో సమర్థులు లేరా?..



ప్రభుత్వం గుండెపై చేయివేసుకొని చెప్పాలి. మంత్రివర్గంలో, మీరు ఇచ్చిన కార్పొరేషన్లలో బీసీల సంఖ్య ఎంత? ఏడాదికి రూ.20 వేల కోట్లు బీసీలకు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పడి 22 నెలలైంది. ఆ లెక్కన రూ.40 వేల కోట్లు బీసీలకు రావాల్సి ఉంది. చట్టాలు చేసేముందు న్యాయస్థానాల వైపు కూడా చూడాలి. ఎలాంటి ఇబ్బందులు వచ్చే పరిస్థితి లేకుండా చట్టాలు చేయాలి. ఎక్కడా ఆటంకాలు కలగకుండా బీసీలకు లబ్ధి కలగాలి. షెడ్యూల్ 9లో జోడించిన అంశంపైనా సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వద్దని మేమెక్కడా చెప్పలేదు" అని పాయల్ శంకర్ తెలిపారు.

## హరీష్ రావు కుంగిపోయారు.. దానికి రీజన్ నాకు తెలుసు

**: డిప్యూటీ CM భట్టి ఆసక్తికర వ్యాఖ్యలు**

తెలంగాణ అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడారు. నీళ్ల కోసమే ప్రత్యేక తెలంగాణ తెచ్చుకున్నామని గుర్తుచేశారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై పారదర్శకంగా చర్చ జరగాలని బీఆర్ఎస్ సభ్యులకు లేదా? అని ప్రశ్నించారు. చెప్పాల్సిందంతా చెప్పి తొండి చేస్తామంటే ఎలా? సభను శాసిస్తామంటే సరికాదని హితవు పలికారు. సభలో చర్చకు వస్తుంటే అల్లరి చేస్తున్నారు. లక్ష కోట్ల దోపిడి చేశారు. కట్టిన పది రోజుల్లోనే కోల్పోతే ప్రజలు ఆవేదన చెందుతున్నారని అన్నారు. జస్టిస్ ఘోష్ రిపోర్టుపై మాత్రమే మేము మాట్లాడాం. రాజకీయ ఆరోపణలు చేయలేదు, కక్ష సాధింపులు లేవు. జస్టిస్ ఘోష్‌పై కూడా హరీష్ రావు అపవాదులు వేస్తున్నారని మండిపడ్డారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడాలని తమకు ఉండి ఉంటే.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఏం చేయాలో అది చేసేవాళ్లమని కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేతల్లాగా తమకు మభ్యపెట్టడం రాదని చెప్పారు. 'రీడిజైన్ పేరుతో ప్రతి ప్రాజెక్టును చీల్చి చెండాడారు. ఇవన్నీ పెంచి



అదనంగా నీళ్లు ఇచ్చారా? అంటే అదీ లేదు. మేడిగడ్డ, సుందిళ్ల పనికిరాకుండా పోయాయి. ఒక్క ఎకరానికి కూడా అదనంగా నీళ్లు ఇవ్వలేదు. హరీష్ రావు కూడా కాళేశ్వరం ప్రాజెక్టు లాగా కుంగిపోయారు. నిటారుగా నిలబడలేక పోతున్నారు. దానికి రీజన్ ఏంటో మన అందరికీ తెలుసు' అని భట్టి విక్రమార్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కాళేశ్వరం మీ కోసమే.. ప్రజల కోసం కాదు.. కనీసం కేబినెట్ అప్రూవల్ కూడా లేదు. కుంగిపోకముందే NDSA కొన్ని సూచనలు చేసింది. NDSA సూచనలను కూడా పట్టించుకోలేదు. కేసీఆర్ చెప్పారు, హరీష్ రావు కట్టారు.. కమిషన్ మమ్మల్ని పిలవలేదని హరీష్ రావు చెబుతున్నారు. ఎవరైనా రావచ్చని కమిషన్ ఓపెన్‌గా ప్రకటనలు ఇచ్చింది' అని భట్టి విక్రమార్క గుర్తుచేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలను లైట్ తీసుకోవద్దు..

### కాంగ్రెస్ శ్రేణులకు పీసీసీ చీఫ్ పిలుపు

డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, కార్పొరేషన్ చైర్మన్‌లతో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లు అమలు చేసే ఘనత కాంగ్రెస్ పార్టీదే అని అన్నారు. ఈ విషయాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్.. రాజకీయంగా బీసీలను అణగదొక్కారని అన్నారు. బీసీ కులగణన చేసి పకడ్బందీగా బీసీ బిల్లు తెచ్చి బీసీలకు రాజకీయ సుస్థిర స్థానం కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీది అని చెప్పారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ఆశయాల మేరకు ఎవరి జనాభా ప్రకారం వారి వాటా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పని చేసిందని అన్నారు. కులగణన చేపట్టాం.. బీసీ కమిషన్ వేశాం.. డెడికేటెడ్ బీసీ కమిషన్ వేసి లెక్కలు తేల్చాం.. అసెంబ్లీ, మండలిలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చేస్తూ బిల్లు చేశామని అన్నారు. ఆ బిల్లులు గవర్నర్, రాష్ట్రపతికి పంపి ఆలస్యం అవుతుంటే కోర్టు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ చేయమంటే ఆర్డినెన్స్ తెచ్చామని స్పష్టం చేశారు. ఆర్డినెన్స్ కూడా గవర్నర్ ఆమోదించకపోవడంతో ఈ రోజు అసెంబ్లీలో మళ్ళీ రిజర్వేషన్లు పరిమితి ఎత్తివేస్తూ 42 శాతం బీసీ రిజర్వేషన్లు చేసి బిల్లు పాస్ చేసి చూపించామని అన్నారు. ఇది తమ ప్రభుత్వ చిత్తశుద్ధి అని చెప్పారు. ఎన్ని రాజకీయ, సాంకేతిక, న్యాయపరమైన అడ్డంకులు వచ్చినా ఎదుర్కొని నేడు బీసీల రిజర్వేషన్లు విషయంలో



అన్ని చేసి చూపించాం.. బీసీ రిజర్వేషన్ల హీరోగా రాహుల్ గాంధీ, ఖర్గే, రేవంత్ రెడ్డిలను నిలబెట్టాలని.. గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఏమాత్రం సులువుగా తీసుకోవద్దు.. పూర్తి స్థాయిలో విజయం సాధించేలా కృషి చేయాలని అన్నారు.

### వరద బాధితులను ఆదుకునేందుకు

## సినీపరిశ్రమ ముందుకు రావాలి: విజయశాంతి

ఇటీవల వరదలు సంభవించిన కామారెడ్డిలో తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీలు పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ... వరదలు కామారెడ్డిని అతలాకుతలం చేశాయని చెప్పారు. కామారెడ్డిలో ఇంత జరుగుతుంటే బీజేపీ ఏం చేస్తుందని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే కనిపించలేదని బాధితులు అంటున్నారని ఆరోపించారు. వరద బాధితులను ఆదుకునేందుకు సినీపరిశ్రమ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం అద్దంకి



దయాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వరద రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. నష్టపరిహారం కోసం నివేదికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కేంద్రాన్ని రూ.10 వేల కోట్ల సాయం అడిగామన్నారు. ఇదిలా ఉంటే కామారెడ్డిలో వరదలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. వరదల కారణంగా జిల్లాలో భారీగా ఆస్తి నష్టం జరిగింది. జాతీయ రహదారి సైతం కొట్టుకుపోయింది. కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో ప్రజలు ఎంతో ఇబ్బందిపడ్డారు.



## హెచ్‌ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలిగా కవిత

సింగరేణిలోని హెచ్‌ఎంఎస్ (ది సింగరేణి మైనర్స్ అండ్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్) గౌరవ అధ్యక్షురాలిగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో నిర్వహించిన హెచ్‌ఎంఎస్ జనరల్ బాడీ మీటింగులో సంఘం ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ కవితను గౌరవ అధ్యక్షురాలిగా ఎన్నుకుంటున్నట్టు ప్రతిపాదించగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. పాత వీఆర్ఎస్ స్కీమ్‌ను పునరుద్ధరించడం, వేలంపాట లేకుండా తెలంగాణ బొగ్గు బ్లాక్‌లను సింగరేణి కేటాయించడం, సింగరేణి కార్మికులకు పెర్క్స్ రీయింబర్స్‌మెంట్ కింద ఐటీ రిటర్న్స్ ఇప్పించడం, సింగరేణిలో అలియాస్ నేమ కనిపించడమారు పేరుల సమస్యతో బాధపడుతున్న కార్మికులను వన్ టైం సెటిల్మెంట్ కింద క్రమబద్ధీకరించడం, అనారోగ్య సమస్యలతో అండర్ గ్రౌండ్ అన్‌ఫిట్ అయి సర్ఫేస్ ఫిట్ తీసుకున్న సింగరేణి కార్మికునికి బేసిక్ ప్రొటెక్షన్, సూటబుల్ జాబ్ ఇప్పించడం, కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయడం, సింగరేణిలో పెండింగ్ విజిలెన్స్ కేసులను క్రమబద్ధీకరించడం, జైపూర్ పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న భూనిర్వాసితులకు రెగ్యులరైజ్ చేయడం, సింగరేణి కార్మికులకు కంపెనీ లాభాల వాటా 35% ఇప్పించడం, సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్‌కి కంపెనీ లాభాల్లో 10% వాటా ఇప్పించడం, సింగరేణిలో పనిచేస్తున్న మహిళలకు వాళ్ల విద్యార్హతకు తగిన ఉద్యోగాలు కల్పించడంపై తీర్మానాలు చేశారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి హోం మంత్రిగా పనిచేసిన కాలం వరకు హెచ్‌ఎంఎస్‌కు గౌరవ అధ్యక్షుడిగా నాయిని నర్సింహారెడ్డి పనిచేశారు. ఆయన తర్వాత హెచ్‌ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలిగా కల్వకుంట్ల కవిత ఎన్నికయ్యారు.

## ఐటీఆర్ నుంచి క్రెడిట్ కార్డుల వరకు..!
## సెప్టెంబర్ ఒకటి నుంచి మారనున్న రూల్స్




**న్యూఢిల్లీ:** ఈ ఆర్థిక సంవత్సరంలో మరో నెల గడిచిపోయింది. రేపటి నుంచి సెప్టెంబర్ మాసం మొదలుకానున్నది. సెప్టెంబర్ నుంచి పలు రూల్స్ మారనున్నాయి. మారనున్న నిబంధనలు రోజువారీ జీవితంపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్నాయి. సెప్టెంబర్ నెలలో ఆదాయపు పన్ను రిటర్న్‌లు, యూపీఎస్, క్రెడిట్ కార్డులకు సంబంధించిన నియమాలను మారనున్నాయి. అలాగే, ఎల్‌పీజీ ధరలు సైతం మారే సూచనలున్నాయి.

ఐటీఆర్ దాఖలు చేసేందుకు చివరి తేదీ జులై 30 కాగా.. ఆదాయపు పన్నుశాఖ సెప్టెంబర్ వరకు పొడిగించింది. తప్పనిసరిగా సెప్టెంబర్ 15 లోపు ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. లేకపోతే నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది.

యూపీఎస్ఎన్‌పీఎస్ అంటే నేషనల్ పెన్షన్ సిస్టమ్ కిందకు వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సెప్టెంబర్ 30లోగా ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. గతంలో జూన్ 30 వరకు గడువు ఉండగా.. సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగించారు.

ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ ఎంపిక చేసిన క్రెడిట్ కార్డుల రూల్స్‌ను మార్పులు చేసింది. సెప్టెంబర్ ఒకటి నుంచి ఈ మార్పులు అమలులోకి రానున్నాయి. రూల్స్ ప్రకారం కొన్ని కార్డుల రివార్డ్ పాయింట్ల నిబంధనలను సవరించింది. ఇకపై డిజిటల్ గేమింగ్, ప్రభుత్వ వెబ్‌సైట్లలో లావాదేవీలపై రివార్డ్ పాయింట్ల పొందలేరు.

సెప్టెంబర్ ఒకటి నుంచి ఎల్‌పీజీ గ్యాస్ ధరల్లో మార్పులు చేసే అవకాశం ఉంది. ప్రతినెలా ఒకటో తేదీన చమురు కంపెనీలు ఎల్‌పీజీ ధరలను సవరించే విషయం తెలిసిందే. ఈ క్రమంలో రేపు ఎల్‌పీజీ ధరలు మారే అవకాశం ఉంది. అలాగే, సీఎన్‌జీ, పీఎన్‌జీ, జెట్ ఇంధన ధరల్లో కూడా మార్పులు ఉండే అవకాశం ఉంది. చమురు కంపెనీలు ధరలు పెంచడం, తగ్గించడం లేదకపోతే యథావిధిగా కొనసాగించే అవకాశం ఉంటుంది.

## యాప్‌లపై కొరడా..

**ప్లే స్టోర్ నుంచి 77 డేంజరెస్ యాప్‌లు తొలగింపు..!**




**న్యూఢిల్లీ:** యాప్‌లపై టెక్ దిగ్గజం గూగుల్ కొరడా ఝుళిపించింది. ప్లే స్టోర్ నుంచి గూగుల్ 77 ప్రమాదకరమైన యాప్‌లను తొలగించింది. ఆయా యాప్‌లన్నీ వినియోగదారుల భద్రత, గోప్యతకు ముప్పుగా మారడంతో చర్యలు తీసుకున్నది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం.. గూగుల్ గత సంవత్సరం సుమారు 40 లక్షల యాప్‌లను తొలగించింది. సగటున ప్రతిరోజూ 11వేల యాప్‌లను ప్లే స్టోర్ నుంచి వేటు వేసింది. నివేదిక ప్రకారం.. తొలగించబడిన యాప్‌లలో సగానికి పైగా డేటా భద్రత, గోప్యతా నియమాలను ఉల్లంఘిస్తున్నాయని తేలింది. గూగుల్ గత సంవత్సరం యాప్ ప్లబిషింగ్‌కు సంబంధించి కఠినమైన నియమాలను అమలు చేస్తామని ప్రకటించింది. ఇప్పుడు దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. 2024 ప్రారంభం నాటికి ప్లే స్టోర్‌లో ఉన్న దాదాపు సగం యాప్‌లను తొలగించారు. గూగుల్ ఈ సంవత్సరం దాదాపు 1.55 లక్షల డెవలపర్ ఖాతాలను కూడా బ్లాక్ చేసింది. కంపెనీ ఇప్పుడు సైడ్‌లోడెడ్ యాప్‌లపై కఠినమైన చర్యలు తీసుకుంటోంది. ఇప్పుడు ధ్రువీకరణ ప్రక్రియ ద్వారా వెళ్లే డెవలపర్స్ మాత్రమే యాప్‌లను ప్రచురించగలరని గూగుల్ చెబుతోంది. ప్లే స్టోర్ నుంచి ఒక యాప్ అదృశ్యమైతే.. దాని అర్థం డెవలపర్ దాన్ని తీసివేసినట్లు కాదని గూగుల్ వినియోగదారులను హెచ్చరించింది. తరచుగా దీనికి కారణం యాప్ నియమాలను ఉల్లంఘించడమే. అయితే, యాప్ ఇప్పటికే మీ ఫోన్‌లో ఉంటే.. అది రన్ అవుతూనే ఉంటుంది. కానీ, అది మరిన్ని అప్‌డేట్‌లు అందవు. యాప్ ప్రమాదకరమైనదిగా తేలితే.. ప్లే ప్రొటెక్ట్ దాన్ని అన్ ఇన్‌స్టాల్ చేయమని హెచ్చరిస్తుంది అని కంపెనీ స్పష్టం చేసింది. కానీ, అలాంటి హెచ్చరిక రాకపోతే యాప్ భద్రతా అప్‌డేట్స్ లేకుండా మీ ఫోన్‌లో రన్ అవుతూనే ఉంటుంది. యూజర్లు సురక్షితంగా డౌన్‌లోడ్ చేసుకునే అలవాటును మార్చుకోవాలని నిపుణులు అంటున్నారు. యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు అనుమతులను తనిఖీ చేయాలని.. రివ్యూలను చదవాలని.. విశ్వసనీయ డెవలపర్‌ల నుంచి మాత్రమే యాప్‌లను ఇన్‌స్టాల్ నివేదిక పేర్కొంది. ఆండ్రాయిడ్ అథారిటీ నివేదిక ప్రకారం.. గూగుల్ ప్రస్తుతం ప్లే స్టోర్‌లో కొత్త 'అన్‌ఇన్‌స్టాల్' బటన్‌ను పరీక్షిస్తోంది. ఈ బటన్ యాప్ పేజీలో నేరుగా కనిపిస్తుంది. తద్వారా వినియోగదారులు తమ ఫోన్ నుంచి ఏదైనా యాప్‌ను వెంటనే తీసివేసే అవకాశం ఉంది.

## వరుసగా మూడో ఏడాది...
## డిష్ టీవీకి జరిమానా

**డిష్ టీవీ ఇండియాకు మళ్లీ జరిమానా విధించిన స్టాక్ ఎక్స్ఛేంజీలు**

**బోర్డు కూర్పు నిబంధనలు పాటించనందుకే ఈ చర్య**

**బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు చెరో రూ. 5.69 లక్షల చొప్పున ఫైన్**

**వాటాదారుల వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని కంపెనీ వివరణ**

**ప్రమోటర్లు, వాటాదారుల మధ్య కొనసాగుతున్న పాత వివాదమే కారణం**

dishtv

**న్యూఢిల్లీ:** ప్రముఖ డైరెక్ట్–టు–హోమ్ (డీటీహెచ్) సేవల సంస్థ డిష్ టీవీ ఇండియాకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. కంపెనీ బోర్డు కూర్పునకు సంబంధించిన నిబంధనలను పాటించడంలో విఫలమైనందుకు గాను, దేశంలోని ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజీలు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లు జరిమానా విధించాయి. ఈ వివాదం కారణంగా కంపెనీ జరిమానా ఎదుర్కోవడం ఇది వరుసగా మూడో ఏడాది.

జూన్ 30తో ముగిసిన త్రైమాసికానికి గాను సెబీ లిస్టింగ్ నిబంధనలు 17(1), 19(1)/(2)లను ఉల్లంఘించినట్లు గుర్తించామని, ఈ మేరకు ఆగస్టు 29న నోటీసులు జారీ చేశామని ఎక్స్ఛేంజీలు తెలిపాయి. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు వేర్వేరుగా రూ. 5.69 లక్షల చొప్పున జరిమానా విధించాయి. 15 రోజుల్లోగా ఈ మొత్తాన్ని చెల్లించాలని ఆదేశించాయి. గతంలో 2023, 2024 సంవత్సరాల్లోనూ డిష్ టీవీ ఇదే కారణంతో జరిమానాలు ఎదుర్కొంది. ఈ జరిమానా చెల్లిస్తామని డిష్ టీవీ ఒక రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. ఈ ఫైన్ వల్ల కంపెనీ ఆర్థిక, కార్యాచరణ కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం ఉండబోదని స్పష్టం చేసింది. వాటాదారులు డైరెక్టర్ల నియామకాలను ఆమోదించకపోవడం వల్లే బోర్డులో సభ్యుల సంఖ్య తగ్గిందని, ఇది యాజమాన్యం నియంత్రణలో లేని విషయమని కంపెనీ వివరణ ఇచ్చింది. గత కొన్నేళ్లుగా డిష్ టీవీలో ప్రమోటర్లు, వాటాదారుల మధ్య బోర్డు పునర్వ్యవస్థీకరణ విషయంలో తీవ్ర వివాదం కొనసాగుతోంది. సుభాష్ చంద్ర కుటుంబానికి చెందిన ప్రమోటర్ గ్రూప్‌కు, గతంలో అతిపెద్ద వాటాదారుగా ఉన్న యెస్ బ్యాంక్‌కు మధ్య ఈ విభేదాలు మొదలయ్యాయి. ప్రస్తుతం యెస్ బ్యాంక్ తన వాటాను జేసీ ఫ్లవర్స్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీకి విక్రయించినప్పటికీ, వివాదం సద్దుమణగలేదు. దీని ప్రభావంతోనే 2022లో మేనేజింగ్ డైరెక్టర్ నియామకంతో పాటు, రెండు ఆర్థిక సంవత్సరాల నివేదికలను కూడా వాటాదారులు తిరస్కరించిన విషయం తెలిసిందే.

# 18 ఏళ్లకే మెరుపు సెంచరీ..

**విధ్వంసక ఆటతో చరిత్ర సృష్టించారిలా..!**




**న్యూఢిల్లీ:** పొట్టి క్రికెట్‌లో దంచికొట్టుడే మంత్రగా ఆడుతున్నారు ఈతరం బ్యాటర్లు. ఐపీఎల్ నుంచి కరీబియన్ ప్రీమియర్ లీగ్ వరకూ తమ విధ్వంసక ఆటతో శతకాలు బాదేస్తూ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తున్నారు హిట్టర్లు. ఇంగ్లండ్ గడ్డ మీద జరుగుతున్న 'ది హండ్రెడ్ లీగ్'లోనూ సెంచరీల పర్వం లిఖిస్తున్నారు కొందరు. పురుషులకు దీటుగా ఆకాశమే హద్దుగా ఆడుతున్న మహిళా బ్యాటర్లు మూడంకెల స్కోర్‌తో రెచ్చిపోతున్నారు.

వంద బంతుల ఈ లీగ్‌లో 'మేమూ రికార్డులు బ్రేక్ చేయగలం' అని చాటుతూ సెంచరీతో చరిత్ర సృష్టించారు ఈ ఇద్దరు. ఒకరు ఇంగ్లండ్ స్టార్ టమ్మీ బ్యూమంట్ కాగా.. మరొకరు ఆ దేశానికే చెందిన 18 ఏళ్ల డవినా పెర్రిన్. ఈ లీగ్ చరిత్రలో టాప్ -5 వేగవంతమైన శతకం బాదిన బ్యాటర్ల జాబితాలో ఈ ఇద్దరూ చోటు దక్కించుకోవడం విశేషం.

ఈమధ్యే పాపులర్ అవుతున్న ది హండ్రెడ్ లీగ్‌లో సెంచరీల మోత మోగిస్తున్నారు బ్యాటర్లు. ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల కెప్టెన్ హ్యారీ బ్రూక్ నార్తర్న్ సూపర్ చార్జర్స్ తరఫున 41 బంతుల్లోనే వంద కొట్టి రికార్డు నెలకొల్పగా.. డవీనా పెర్రిన్ బౌలర్లను ఊచకోత కోస్తూ శతకంతో చెలరేగింది. నార్తర్న్ సూపర్‌చార్జర్స్‌కు ఆడుతున్న ఈ యువ బ్యాటర్ ఎలిమినేటర్ పోరుతో సివంగిలా పంజా విసిరి 42 బంతుల్లోనే సెంచరీకి చేరువైంది. తద్వారా మహిళల ది హండ్రెడ్ లీగ్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసిందీ డేరింగ్ హిట్టర్.

పెర్రిన్ కంటే ముందు టమ్మీ బ్యూమంట్ ఈ లీగ్‌లో వంద కొట్టింది. రెండేళ్ల క్రితం 'ది వెల్ష్ ఫైర్' జట్టు తరఫున ఈ రైట్ హ్యాండర్ 52 బంతుల్లో శతక గర్జన చేసి.. తొలి సెంచూరియన్‌గా రికార్డు పుస్తకాల్లో చేరింది. కానీ.. ఐదో సీజన్‌లో పెర్రిన్ ఆమె రికార్డును బద్ధలు కొడుతూ వేగవంతమైన శతకంతో సరికొత్త చరిత్ర లిఖించింది. ఇప్పటివరకైతే మహిళల ది హండ్రెడ్ లీగ్‌లో సెంచరీ బాదింది ఈ ఇద్దరు మాత్రమే.

**టాప్ -5 సెంచరీలు..!**

పురుషుల, మహిళల ది హండ్రెడ్ లీగ్ చరిత్రలో ఫాస్టెస్ట్ సెంచరీ కొట్టింది ఎవరంటే..హ్యారీ బ్రూక్ (నార్తర్న్ సూపర్‌ఛార్జర్స్)- 41 బంతుల్లో, డవీనా పెర్రిన్ (నార్తర్న్ సూపర్‌ఛార్జర్స్) - 42 బంతుల్లో, విల్ జాక్స్(ఓవల్ ఇన్విసిబుల్స్) - 47 బంతుల్లో, విల్ స్మీడ్ (బర్మింగ్‌హమ్ ఫీనిక్స్) -49 బంతుల్లో, టమ్మీ బ్యూమంట్(ది వెల్ష్ ఫైర్)- 52 బంతుల్లో వంద కొట్టేశారు.

# 12 బంతుల్లో 11 సిక్సర్లు..

**ఆకాశమే హద్దుగా**
**రెచ్చిపోయిన చిచ్చరపిడుగు..!**



**న్యూఢిల్లీ:** ఫార్మాట్ ఏదైనా యువ క్రికెటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగుతూ ప్రకంపనలు సృష్టిస్తున్నారు. బౌలర్లను వణికిస్తూ సిక్సర్ల మోతతో విరుచుకుపడూ ఒంటిచేత్తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేస్తున్నారు. తాజాగా కేరళ క్రికెట్ లీగ్‌లో సల్మాన్ నిజార్ తనదైన విధ్వంసక బ్యాటింగ్‌తో ఔరా అనిపించాడు. ఎదుర్కొన్న 12 బంతుల్లో 11 సిక్సర్లు బాదేశాడు. కాలికట్ గ్లోబ్‌స్టార్స్ కెప్టెన్ అయిన సల్మాన్ తమ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఊచకోతను తలపించిన అతడి బ్యాటింగ్ వీడియో నెట్టింట వైరలవుతోంది.

కాలికట్ గ్లోబ్ స్టార్స్ సారథి అయిన సల్మాన్ నిజార్ శనివారం కెరీర్లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడాడు. అదానీ త్రివేండ్రం రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓటమి అంచున నిలిచిన జట్టును గెలిపించాడు. 14వ ఓవర్లో అతడు క్రీజులోకి వచ్చే సరికి కాలికట్ టీమ్ స్కోర్.. 76/4. కీలక వికెట్లు పడిన వేళ సల్మాన్ టాప్ గేర్ ఆటతో చెలరేగాడు. డెత్ ఓవర్లో వీరంగం సృష్టించిన అతడు.. 12 బంతుల్లో 11 సిక్సర్లు బాదాడు.

ఐపీఎల్ పేసర్ బసిల్ థంపి వేసిన 19వ ఓవర్లో అతడు వరుసగా ఐదు బంతుల్ని స్టాండ్‌లోకి పంపాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో ఆరు బంతుల్ని సిక్సర్లుగా మలిచిన అతడు.. ఒక నో బాల్, ఒక వైడ్‌తో కలిపి 40 రన్స్ పిండుకున్నాడు. అతడి అసాధారణమైన బ్యాటింగ్‌తో కాలికట్ గ్లోబ్‌స్టర్స్ నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 186 రన్స్ చేసింది. అనంతరం బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి తక్కువ స్కోర్‌కే ప్రత్యర్థిని నిలువరించారు. అదానీ జట్టు బౌలర్లపై ఉప్పెనలా విరుచుకుపడిన సల్మాన్ వచ్చే సీజన్ ఐపీఎల్ వేలంలో భారీ ధర పలకడం ఖాయమనిపిస్తోంది.

**టీమిండియా స్టార్‌కు కానుకగా 'పోర్షే' కారు..**

# బిగ్ ప్రామిస్ నిలబెట్టుకున్నా..!



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోడీ వరుసగా భారత క్రికెట్‌కు సంబంధించిన సంచలన విషయాలు పంచుకుంటున్నాడు. ఈమధ్యే హర్భజన్ సింగ్ – శ్రీశాంత్ చెంపదెబ్బ వీడియోతో వార్తల్లో నిలిచిన లలిత్.. ఈసారి టీమిండియా స్టార్‌కు ఖరీదైన కారు బహుమతిగా ఇచ్చానని వెల్లడించాడు. ఆస్ట్రేలియా మాజీ సారథి మైఖేల్ క్లార్క్ పాడ్‌కాస్ట్' బియాండ్23'లో మాట్లాడుతూ.. 2007 టీ20 వరల్డ్ కప్ అనంతరం యువరాజ్ సింగ్‌కు 'పోర్షే' కారును ప్రదానం చేసిన విషయాన్ని బహిర్గతం చేశాడు లలిత్. 'నేను భారత క్రికెటర్లకు భారీ ఆఫర్ ప్రకటించాను. బ్యాటర్లు ఎవరైనా ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లు కొట్టినా.. బౌలర్లు ఆరు బంతుల్లో ఆరు వికెట్లు తీసినా వాళ్లకు పోర్షే కారు గిఫ్ట్‌గా ఇస్తానని చెప్పాను. అయితే.. 2007 పొట్టి ప్రపంచ కప్ వరకూ ఎవరూ ఈ ఫీట్ సాధించలేదు. కానీ, యువరాజ్ సింగ్ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ ఇంగ్లండ్‌పై ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లతో చరిత్ర సృష్టించాడు. అంతే.. ఇచ్చిన మాటకు కట్టుబడి అతడికి పోర్షే బహూకరించాను' అని లలిత్ మోడీ అప్పటి సంఘటనను వివరించాడు. అంతేకాదు ఇంగ్లండ్ ప్రధాన పేసర్ స్టువార్ట్ బ్రాడ్ ఓవర్లో యూవీ ఆరు సిక్సర్లు బాదిన రోజు ఏం జరిగిందో గుర్తు చేసుకున్నాడీ ఐపీఎల్ మాజీ ఛైర్మన్. 'సూపర్ 8 స్టేజ్‌లో ఇంగ్లండ్, భారత్ తలపడ్డాయి. ఆ రోజు చరిత్రాత్మకమైన ఇన్నింగ్స్ ఆడిన యువరాజ్ బౌండరీ అవతల ఉన్న నా వైపు చూశాడు. ఆరు సిక్సర్లు కొట్టిన తర్వాత నేను సాధించాను అన్నట్టుగా నావైపు బ్యాట్ చూపించాడు. అంతేనా.. ఇన్నింగ్స్ పూర్తయ్యాక పరుగెత్తుతూ నా వద్దకు వచ్చి నాకు పోర్షే కావాలి. నా పోర్షే ఎక్కడ? అని నాతో అన్నాడు. అతడలా అంటుంటే నేను నవ్వుతూ ఒకే .. నీ బ్యాట్ నాకు ఇవ్వు అని అన్నాను' అని పద్దెనిమిదేళ్ల క్రితం నాటి సంఘటనను నెమరువేసుకున్నాడు మోడీ.

దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన తొలి ఎడిషన్ పొట్టి వరల్డ్ కప్‌లో ఎంఎస్ ధోనీ సారథ్యంలోని భారత జట్టు ఛాంపియన్‌గా అవతరించింది. బ్రాడ్ ఓవర్లో సిక్సర్లతో హోరెత్తించిన యూవీ.. ఈ ఫార్మాట్‌లో వేగవంతమైన అర్ధశతకం బాదడమే కాకుండా టీమిండియా ట్రోఫీ నెగ్గడంలో కీలక పాత్ర పోషించాడు. టోర్నీ ఆసాంతం ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన ఈ లెఫ్ట్ హ్యాండర్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డునూ ఎగరేసుకుపోయాడు.

## ఎన్నికల్లో పోటీ చేస్తున్నా..
# అధ్యక్షుడిని అవ్వాలనుకుంటున్నా..!

**ఢాకా:** బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. సుదీర్ఘ కాలం ఓపెనర్‌గా జట్టుకు విశేష సేవలందించిన అతడు తమ దేశ క్రికెట్ బోర్డు ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నాడు. అక్టోబర్‌లో జరుగబోయే బోర్డు సభ్యుల ఎన్నికల్లో ఈ మాజీ ఓపెనర్ బరిలోకి దిగుతున్నాడు. ఒకవేళ సభ్యుడిగా గెలిస్తే అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు ప్రయత్నిస్తానని తమీమ్ తెలిపాడు.

'అక్టోబర్‌లో జరుగబోయే బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సభ్యుల ఎన్నికల్లో పోటీ చేస్తున్నాను. నాకు రెండు క్లబ్స్ మద్దతు ఉంది. సభ్యుడిగా ఎంపికయ్యాక అధ్యక్ష పదవి గురించి ఆలోచిస్తాను. ఎందుకుంటే.. ఇప్పుడే అధ్యక్షుడిని అవుతానని చెప్పడం అవివేకం అవుతుంది. ప్రస్తుతం బ బోర్డు సభ్యుల మధ్య సఖ్యత లేదు. బోలెడన్ని అబద్ధాలు చెబుతున్నారు. దాంతో.. బంగ్లా క్రికెట్ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. అవకాశం వస్తే ఇవన్నీ మార్చాలని అనుకుంటున్నాను' అని తమీమ్ వెల్లడించాడు.

బంగ్లా క్రికెట్ బోర్డులో 25 మంది సభ్యులు ఉంటారు. ఎన్నికలు ముగిసిన తర్వాత బీసీబీ రాజ్యాంగం ప్రకారం.. కేటగిరీ 1లో ఢాకాకు చెందిన క్లబ్స్‌కు చెందిన 76 మంది కౌన్సిలర్లు 12 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. రెండో కేటగిరిలో జిల్లా, ప్రాంతీయ క్లబ్స్‌కు చెందిన ప్రతినిధులు పాల్గొంటారు. 10 మంది సభ్యులను 8 డివిజన్లు, 64 జిల్లాల్లోని కౌన్సిలర్లు ఎన్నుకుంటారు. కేటగిరీ 3లో ఒక పోస్ట్ ఉంటుంది. ఇతర ప్రతినిధులు కోటా ప్రకారం ఒక సభ్యుడిని ప్రకటిస్తారు.




ఇద్దరు డైరెక్టర్లును జాతీయ క్రీడా మండలి నామినేట్ చేస్తుంది.

**అన్ని ఫార్మాట్లలో బెస్ట్**

తమీమ్ 2007లో వన్డేల్లో ఆరంగేట్రం చేశాడు. అనతి కాలంలోనే బంగ్లాదేశ్ తరఫున అన్ని ఫార్మాట్లలో ఉత్తమ బ్యాటర్‌గా ఎదిగాడు. పసికూనగా అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన బంగ్లా.. పెద్ద జట్లకు షాక్ ఇవ్వడంలో ఈ లెఫ్ట్ హ్యాండర్ ఓపెనర్ పాత్ర ఎంతో ఉంది. మరో విషయం ఏంటంటే.. అతనికి టీమిండియాపై ఘనమైన రికార్డు ఉంది. అవును.. అతడి 56 అర్ధ శతకాల్లో భారత్‌పై చేసినవే ఎక్కువ. ఓపెనింగ్ బ్యాటర్ అయిన తమీమ్ సంచలన ఇన్నింగ్స్‌లకు చిరునామాగా మారాడు. మొదటి బంతి నుంచే బౌలర్లపై విరుచుకుపడే అతను బంగ్లా జట్టుకు దూకుడు నేర్పాడు. కీలక మ్యాచుల్లో మెరపు బ్యాటింగ్ చేసి జట్టును గెలిపించిన సందర్భాలు ఎన్నో.

**టెస్టుల్లో 10 శతకాలు**

పేసర్ ముష్రఫే మొర్తాజా నుంచి తమీమ్ 2020లో వన్డే జట్టు సారథిగా ఎంపికయ్యాడు. అతడి కెప్టెన్సీలో బంగ్లా 37 మ్యాచుల్లో 21 సార్లు గెలుపొందింది. టెస్టుల్లోనూ ఈ లెఫ్ట్ హ్యాండర్ 10 శతకాలతో సత్తా చాటాడు. అతను 2009లో వెస్టిండీస్ పర్యటనలో తొలి సెంచరీ చేశాడు. ఆ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ విండీస్‌ను ఓడించి, విదేశీ గడ్డపై తొలి విజయం నమోదు చేసింది. స్వదేశంలో ఈ మధ్యే అఫ్గనిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టుకు ఇక్బాల్ దూరమయ్యాడు. అయితే.. వన్డే సిరీస్‌లో మాత్రం ఆడాడు.

# తరగని వయసుతో కవ్విస్తున్న జెనీలియా



టాకీస్: జెనీలియా డిసౌజా.. ఈ బ్యూటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ చిత్రాలలో నటించి మెప్పించింది జెనీలియా. అమితాబ్ బచ్చన్‌తో కలిసి చేసిన పార్కర్ పెన్ వాణిజ్య ప్రకటన ద్వారా జెనీలియా గుర్తింపు పొందింది. 2003లో హిందీ చిత్రం తుఝే మేరీ కసమ్ ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది ఈ అందాల ముద్దుగుమ్మ. జెనీలియా డిసౌజా.. ఈ బ్యూటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ చిత్రాలలో నటించి మెప్పించింది జెనీలియా. అమితాబ్ బచ్చన్‌తో కలిసి చేసిన పార్కర్ పెన్ వాణిజ్య ప్రకటన ద్వారా జెనీలియా గుర్తింపు పొందింది. 2003లో హిందీ చిత్రం తుఝే మేరీ కసమ్ ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది ఈ అందాల ముద్దుగుమ్మ. అదే సంవత్సరం తమిళ చిత్రం బాయ్స్‌లో నటించి దక్షిణ భారత సినిమాల్లోకి అడుగుపెట్టింది. ఈ సినిమా తెలుగులోనూ విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఇక తెలుగులో సత్యం , సై , బొమ్మరిల్లు , ఢీ, రెడీ , కథ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయింది. ముఖ్యంగా బొమ్మరిల్లు చిత్రంలో ఆమె నటనకు ఫిల్మ్‌ఫేర్ అవార్డు (ఉత్తమ నటి - తెలుగు) లభించింది. తెలుగు ప్రేక్షకుల మనసులో స్థానం సంపాధించుకుంది. హిందీలో మస్తీ (2004), జానే తు... యా జానే నా (2008), తమిళంలో సంతోష్ సుబ్రమణియం (2008) వంటి చిత్రాల్లో నటించి విజయం సాధించింది. పెళ్లి తర్వాత ఈ ముద్దుగుమ్మ సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. ఇక ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టి సినిమాలు చేస్తుంది జెనీలియా. 2012లో బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్‌ను వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు కుమారులు - రియాన్ (2014), రాహిల్ (2016). సినిమాలతో పాటు సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటుంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంటుంది.



## అల్లు కుటుంబ సభ్యులను పరామర్శించిన పవన్ కళ్యాణ్

**అల్లు అరవింద్ కు మాతృవియోగం**

**శనివారం బిజీ షెడ్యూల్ కారణంగా రాలేకపోయిన పవన్**

**ఆదివారం స్వయంగా అల్లు అరవింద్ నివాసానికి వచ్చిన జనసేనాని**



**హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను వారి నివాసంలో పరామర్శించారు. అల్లు అరవింద్ మాతృమూర్తి అల్లు కనకరత్నం అనారోగ్యంతో కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా వారి ఇంటికి వెళ్లి అల్లు కుటుంబ సభ్యులను ఓదార్చారు.

విషాదంలో ఉన్న అల్లు అరవింద్, అల్లు అర్జున్, ఇతర కుటుంబ సభ్యులతో పవన్ కల్యాణ్ మాట్లాడారు. అల్లు కనకరత్నం గారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులందరూ ధైర్యంగా ఉండాలని సూచించారు.

రాజకీయాల్లో అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ బిజీగా ఉన్నప్పటికీ, పవన్ కల్యాణ్ స్వయంగా వచ్చి తమను పరామర్శించడం పట్ల అల్లు అరవింద్, అల్లు అర్జున్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సినీ పరిశ్రమకు చెందిన ఈ రెండు ప్రముఖ కుటుంబాల మధ్య ఉన్న అనుబంధం ఈ సందర్భంగా మరోసారి స్పష్టమైంది.

శనివారం అల్లు కనకరత్నం భౌతికకాయానికి పవన్ కల్యాణ్ భార్య అన్నా లెజినోవా నివాళులు అర్పించారు.



## టాలీవుడ్‌లో దూసుకుపోతున్న మలయాళం సినిమా 'కొత్త లోక'

**టాకీస్:** ఇటీవల థియేటర్లలో విడుదలైన మలయాళ చిత్రం 'కొత్త లోక' తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. మలయాళంలో సూపర్ హిట్ అయిన ఈ చిత్రం తెలుగులో కొంత ఆలస్యంగా, పలు సమస్యల మధ్య విడుదలైనప్పటికీ, అద్భుతమైన స్పందన పొందింది. ఈ సినిమాలో కల్యాణి ప్రియదర్శన్ ప్రధాన పాత్రలో నటించగా 'ప్రేమలు' ఫేమ్ నటుడు నస్లెన్ కీలక పాత్రలో మెప్పించారు.




వీకెండ్ రావడంతో 'కొత్త లోక' తెలుగులో మంచి ఓపెనింగ్స్ సాధించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. మొదటి రోజు, (శనివారం) తెలుగు రాష్ట్రాల నుంచి ఈ చిత్రం ఒక కోటి రూపాయలకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించినట్లు సమాచారం. పెద్దగా ప్రచారం, బజ్ లేకుండానే ఈ స్థాయిలో కలెక్షన్స్ రాబట్టడం విశేషం. ఈ సినిమాకు డామినిక్ అరుణ్ దర్శకత్వం వహించగా, తెలుగులో నాగవంశీ సమర్పణలో విడుదలైంది. తెలుగు ప్రేక్షకులు కూడా ఈ సూపర్ హీరో చిత్రానికి మంచి మార్కులు వేయడంతో, రాబోయే రోజుల్లో మరిన్ని కలెక్షన్స్ సాధించే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## చిత్ర పరిశ్రమలో విషాదం..

**నటి ప్రియా మరాఠే కన్నుమూత..!**

**టాకీస్:** భారతీయ చిత్ర పరిశ్రమలో విషాదకర ఘటన చోటు చేసుకున్నది. ప్రముఖ టెలివిజన్ షో 'పవిత్ర రిస్తా' ఫేమ్ నటి ప్రియా మరాఠే (38) తుదిశ్వాస విడిచారు. ముంబయిలని మీరా రోడ్‌లోని తన ఇంట్లో ఆమె కన్నుమూశారు. నటి మరణ వార్త అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. సోషల్ మీడియా వేదికగా ఆమె మృతిపై పలువురు విచారం వ్యక్తం చేశారు. 'ఇది చాలా షాకింగ్ వార్త. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి' అంటూ ఓ యూజర్ రాశారు. 'పవిత్ర రిస్తా' సీరియల్‌లో ఆమె వర్ష పాత్రను పోషించారు. ప్రియా మాత్రమే పలు మరాఠీ సీరియల్స్‌తో పాటు చిత్రాల్లోనూ నటించారు.



పలు హిందీ టెలివిజన్ షోల్లో కూడా పాల్గొంది. ఇందులో 'పవిత్ర రిస్తా'లో వర్ష పాత్రతో అభిమానులకు దగ్గరైంది. ఈ సీరియల్‌లో నటి అంకితా లోఖండే సోదరి పాత్రను పోషించింది. ఈ సీరియల్‌లో సుశాంత్ రాజ్‌పుత్ సింగ్ కూడా నటించిన విషయం తెలిసిందే. అలాగే, 'చార్ దివాస్ ససుచే, కసమ్ సే, కామెడీ సర్కస్ కే సూపర్ స్టార్స్, ఉత్తరన్, బడే అచ్చే లగ్తే హై, భారత్ కా వీర్ పుత్ర మహారాణా ప్రతాప్, సావధాన్ ఇండియా, భాగే రే మన్ వంటి షోలలో నటించింది. 2012 ఇండస్ట్రీలోకి వచ్చిన ప్రియా.. ఇప్పటి వరకు 20పైగా షోలతో పాటు రెండు చిత్రాల్లో నటించారు. మె చేసిన పాత్రలన్నీ చాలా సహజంగా ఉంటాయి.

## జాన్వీ కపూర్ చెప్పిన 'పరమ్ సుందరి' కబుర్లు

**టాకీస్:** తన కొత్త రొమాంటిక్ కామెడీ చిత్రం 'పరమ్ సుందరి' ప్రమోషన్స్‌లో భాగంగా నటి జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ సినిమాలో ఆమె పోషించిన 'సుందరి' పాత్రకు సంబంధించిన కొన్ని ఇష్టమైన విషయాలను అభిమానులతో పంచుకున్నారు. తన నటనతో మంచి ప్రశంసలు అందుకుంటున్న ఈ బ్యూటీ, సినిమా ప్రమోషన్ల కోసం వినూత్నంగా ముందుకు వెళ్తున్నారు.



తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో, జాన్వీ కొన్ని ఫొటోలు, వీడియోలతో కూడిన ఒక ఆల్బమ్‌ను పోస్ట్ చేశారు. ఇందులో ఒక ఏనుగుతో నవ్వుతూ ఫోజులివ్వడం, శాస్త్రీయ నృత్య భంగిమలతో ఆకట్టుకోవడం వంటివి ఉన్నాయి. తన సహనటుడు సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి దిగిన ఫొటోను, తలలో అందమైన గజ్రా పెట్టుకున్న స్టిల్‌ను కూడా పంచుకున్నారు. కొన్ని చిత్రాల్లో సుందరి పాత్ర గెటప్‌లో నమస్కరిస్తూ, మరికొన్నింటిలో సరదాగా నాలుక బయటపెట్టి చిలిపిగా కనిపించారు. చివరగా, తన ఐప్యాడ్ చూస్తూ సేద తీరుతున్న ఫొటో కూడా ఈ పోస్టులో ఉంది. "సుందరికి ఇష్టమైన కొన్ని విషయాలివే ఇప్పుడు థియేటర్లలో" అని జాన్వీ ఈ పోస్టుకు క్యాప్షన్ జోడించారు. ఇదిలా ఉండగా, 'పరమ్ సుందరి' ప్రమోషన్ల కోసం ఇటీవల 'సూపర్ డ్యాన్సర్ చాప్టర్ 5' అనే డ్యాన్స్ షోకు జాన్వీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె తన తల్లి, దివంగత నటి శ్రీదేవిని గుర్తుచేసుకున్నారు. 1991లో వచ్చిన 'లమ్హే' చిత్రంలో శ్రీదేవి చేసిన 'రేజ్ డ్యాన్స్'లో ఎంతటి ఆవేశం, అంతర్గత సంఘర్షణ దాగి ఉన్నాయో ఆమె వివరించారు. ప్రస్తుతం జాన్వీ షేర్ చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



# అలా మొదలైంది..

టాకీస్:దుబాయ్‌కు చెందిన వ్యాపారవేత్త రజిత్ ఇబ్రాన్ తో రిలేషన్ షిప్ లో ఉన్నానన్న విషయాన్ని సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. దీంతో సినీ ప్రముఖులు, అభిమానులు ఈ ముద్దుగుమ్మకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అసలు జిబ్రాన్ తో పరిచయం ఎప్పుడు మొదలైంది? ప్రేమ దాకా ఎలా వెళ్లింది? పెళ్లెప్పుడు చేసుకుంటారన్న విషయాలను లేటెస్ట్ గా ఓ ఇంటర్వ్యూలో షేర్ చేసుకుంది నివేద. 'ఐదేళ్ల క్రితం దుబాయిలో ఓ రేసింగ్ సందర్భంగా రజిత్‌తో మొదటి సారి నాకు పరిచయం జరిగింది. మొదట మంచి స్నేహితులుగానే ఉన్నాం. ఆ తరవాత ఇద్దరి అభిప్రాయాలు, మనసులు కలవడంతో ఇద్దరు ప్రేమికులమయ్యాం. మా సర్కిల్ లో చాలా తక్కువ మందికి మాత్రమే మా ప్రేమ విషయం తెలుసు. సినిమా ఇండస్ట్రీలోనూ ఎవరికీ ఈ విషయం తెలియదు. సడెన్ గా మా ప్రేమ విషయం బయట పెట్టడంతో నా మేనేజర్ తో సహా అందరూ షాక్ అ య్యారు.' రజిత్‌తో అక్టోబర్ లో నా ఎంగేజ్ మెంట్ ఉండనుంది. ఆ తర్వాత జనవరిలో పెళ్లి ఉండనుంది. అయితే డేట్ ఇంకా ఫైనలైజ్ చేయలేదు. కానీ ఇప్పటికే పెళ్లి పనులు మొదలు పెట్టేశాం. ప్రస్తుతం మా ఇద్దరి కుటుంబాలు దుబాయ్ లో ఉన్నాయి. కుటుంబ సభ్యులు, అతి కొద్ది మంది సన్నిహితుల సమక్షంలో సింపుల్ గానే మా పెళ్లి వేడుకను చేసుకుంటాం' అని నివేద చెప్పుకొచ్చింది. మధురైలో పుట్టి పెరిగిన నివేదా పేతురాజ్ .. 'మెంటల్ మదిలో' అనే మూవీతో తెలుగులోకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత చిత్రలహరి, బ్రోచేవారెవరా, అల వైకుంఠపురములో, రెడ్, పాగల్, విరాటపర్వం, దాస్ కా దమ్కీ తదితర సినిమాల్లో యాక్ట్ చేసింది. అలాగే కార్ రేసింగ్, బ్యాడ్మింటన్ పోటీల్లోనూ సత్తా చాటింది. అయితే ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ చేతిలో ఎలాంటి సినిమాలు లేవని తెలుస్తోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.